E KABURU - Digital News Paper
E-PAPER
ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 21-05-2026 (వారం) గురువారం సంపుటి: 02 || సంచిక:138|| పేజీలు–6
www.ekaburu.com

మోదీ, అమిత్ షా దేశాన్ని అమ్మేశారు

రాహుల్ గాంధీ ధ్వజం

ఈ-కబురు, రాయ్‌బరేలీ, దిల్లీ: కాంగ్రెస్, భాజపాల మధ్య మాటల యుద్ధం తీవ్రమైంది. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆరెస్సెస్‌లు

ఫ్యూచర్ సిటీలో వెంటనే నిర్మాణాలు!

భూ కేటాయింపులు జరిపిన వెంటనే ప్రారంభించాలి: సీఎం

పరిశ్రమలకు ఈ నిబంధన తప్పనిసరి చేయాలి

పరిశ్రమల శాఖ, ఫ్యూచర్ సిటీపై సీఎం సమీక్ష

జూన్‌లో భూమి పూజకు ఏర్పాట్లు చేయాలి

'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో పెట్టుబడుల ఆకర్షణకు ప్రత్యేక

హైదరాబాద్‌కు వెలుపల జీసీసీల ఏర్పాటుకు ప్రత్యేక పాలసీ..

1,500 ఎకరాల్లో డేటా సిటీ

ప్రజాప్రతినిధులు, సివిల్ సర్వెంట్లు,జర్నలిస్టులకు 500 ఎకరాలుకేటాయించాలని ఆదేశం

ఈ-కబురు, హైదరాబాద్:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఫ్యూచర్ సిటీలో పరిశ్రమలకు భూముల కేటాయింపుపై ప్రభుత్వం దృష్టి సారించింది. భూ కేటాయింపులు జరిపిన వెంటనే ఆయా పరిశ్రమలు నిర్మాణాలు ప్రారంభించాలనే నిబంధన తప్పనిసరి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. 'ఫ్యూచర్ సిటీ పారిశ్రామిక వాడలో వివిధ కంపెనీలు తమ ప్రాంగణాల్లో జూన్‌లో భూమి పూజలు నిర్వహించేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలి. ఫ్యూచర్ సిటీలో భారీగా పెట్టుబడులు రాబట్టేందుకు వీలైన అన్ని చర్యలు చేపట్టాలి. 'ఇన్వెస్ట్ తెలంగాణ'పేరుతో పెట్టుబడుల ఆకర్షణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలి. ఆకర్షణీయమైన లోగో, వెబ్‌సైట్ రూపొందించాలి. ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలి. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారి కోసం ఎస్కార్ట్ ఆఫీసర్ వ్యవస్థను రూపొందించాలి. గ్రూప్ 1 స్థాయి అధికారిని ఎస్కార్ట్ ఆఫీసర్‌గా నియమించే అంశాన్ని పరిశీలించాలి. హైదరాబాద్ బయట కూడా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీలు) ఏర్పాటు చేసేలా ప్రత్యేక పాలసీ తీసుకురావాలి.

మిగతా 2లో

ఇంటి నుంచి పని అంటూ..

8,000 మందికి మెటా లేఆఫ్

ఉద్యోగులకు ఇ-మెయిల్ ద్వారా సమాచారం

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్ మాతృసంస్థ మెటా ప్లాట్‌ఫామ్స్.. ప్రపంచవ్యాప్తంగా 8,000 ఉద్యోగాల తొలగింపు ప్రక్రియను ప్రారంభించినట్లుగా తెలుస్తోంది. ఐరోపా, అమెరికా, సింగపూర్‌లలో కొందరు ఉద్యోగులకు 'ఇంటి నుంచి పని'కి అవకాశం కల్పించి.. తదుపరి ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు 'ఇ-మెయిల్' ద్వారా సమాచారాన్ని మెటా పంపిందని ఆంగ్ల పత్రికలు తెలిపాయి.ఇంజినీరింగ్, ప్రోడక్ట్ బృందాల్లో తాజా ఉద్యోగాల కోత ఎక్కువగా ఉందని వెల్లడించింది. ఈ ఏడాదిలో మరికొంత మందిని తొలగించే అవకాశాలున్నాయనీ చెబుతున్నారు.

04

మెట్రో రెండో దశకు కేంద్రం సానుకూలం

నిర్మాణ వ్యయంలో సగం భరించేందుకు సిద్ధం

కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో సమావేశం

తర్వాత కిషన్‌రెడ్డి వెల్లడి

అమెరికాది ఆటవిక న్యాయం

బంధం బలోపేతం

ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంతో సంబంధాలు ఉన్నత స్థాయికి..

ద్వైపాక్షిక వాణిజ్యం 2029 నాటికి 20 బిలియన్ యూరోలకు

రోమ్‌లో భారత ప్రధాని మోదీ, ఇటలీ ప్రధాని మెలొనీ భేటీ

ద్వైపాక్షిక సంబంధాలను పెంపొందించుకోవాలని నిర్ణయం

02

సనాతన ధర్మానికి ఆధునిక ప్రపంచానికి వారధి...

ఆర్ట్ ఆఫ్ లివింగ్

ఈ-కబురు, బెంగుళూరు, మే 20:

సనాతన ధర్మానికి ఆధునిక ప్రపంచానికి వారధిగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ పనిచేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. మానసిక ఒత్తిడిలేని సమాజం ప్రపంచ శాంతి లక్ష్యంగా ఆ సంస్థ నాలుగు దశాబ్దాలుగా సేవలు అందిస్తోందని అన్నారు. బెంగుళూరులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ 45వ వార్షికోత్సవానికి సీఎం హాజరయ్యారు. శ్రీశ్రీ రవిశంకర్ గురూజీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. నాలుగు దశాబ్దాలుగా మానవాళి శ్రేయస్సు, శాంతి సౌఖ్యాల కోసం పనిచేస్తున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ వార్షికోత్సవంలో పాల్గొనటం గౌరవంగా భావిస్తున్నానని అన్నారు. శ్రీ రవిశంకర్ గురూజీ కేవలం ఆధ్యాత్మిక బోధనలతో పాటు శాంతి సామరస్యాలను చాటిచెప్పే ప్రపంచ మానవుడని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. హింస లేని సమాజం, ఒత్తిడి లేని మనుషులు అనే లక్ష్యాన్ని సాధించాలని ఆయన దశాబ్దాలుగా మానవాళికి గొప్ప సేవ చేస్తున్నారని అన్నారు. యుద్ధాలతో శాంతికి దూరమైన సమాజాన్ని అనిశ్చితి నుంచి బయట పడేసేలా మానవత్వమే అత్యుత్తమ మార్గంగా ఆయన ఎంచుకున్నారని అన్నారు. ట్రాన్స్‌ఫర్మేటివ్ పవర్, డైలాగ్, ఇన్నర్ స్ట్రెంత్ వంటి విధానాల ద్వారా గ్రామాల నుంచి అంతర్జాతీయ సంస్థల వరకూ, కొలంబియా వంటి సంఘర్షణ ప్రాంతాల వరకూ చర్చల మార్గంలో మార్పులు తెచ్చారని స్పష్టం చేశారు. సామాన్య ప్రజలతో పాటు అంతర్జాతీయ సంస్థల విశ్వాసాన్ని గెలుచుకున్న ఆధ్యాత్మిక వేత్తగా శ్రీరవిశంకర్ గురూజీ నిలిచారన్నారు.

మిగతా 2లో

రాష్ట్రానికి అదనంగా రూ.5 వేల కోట్లు ఇవ్వండి

ఎన్ఏఎన్‌సీఐ కింద అదనపు సాయం అందించండి

కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరిన డిప్యూటీ సీఎం భట్టి

ఈకబురు, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర సమగ్రాభివృద్ధి, విద్యారంగ రూపాంతరమే లక్ష్యంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కీలక భేటీ జరిపారు. రాష్ట్రంలో మౌలిక వసతుల విస్తరణ, మానవ వనరుల అభివృద్ధికి కేంద్రం నుంచి అదనపు ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ ఆయన వినతి పత్రాలు సమర్పించారు.

02

దండెత్తిన ఎండ

- 19 జిల్లాల్లో 46 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు
- అత్యధికంగా నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో 46.5
- వడదెబ్బతో ఒకే రోజు 11 మంది మృతి
- 25 వరకు వడగాలులు వీస్తాయి: వాతావరణశాఖ
- పగలు బయట తిరగొద్దని ప్రజలకు సూచన

అదే నా చివరి కోరిక

....నా శవంపై కాషాయ జెండా కప్పాల్సిందే

03

కోల్‌కతా నిలిచింది... ముంబయిపై గెలుపు

ఐపీఎల్-19లో తన ప్లేఆఫ్స్ అవకాశాలను కోల్‌కతా నైట్‌రైడర్స్ సజీవంగా ఉంచుకుంది. ఆసక్తికరంగా సాగిన స్వల్ప స్కోర్ల పోరులో ముంబయి ఇండియన్స్‌ను మట్టికరిపించింది.

దండెత్తిన ఎండ



ఈకబురు, హైదరాబాద్ : భానుడి భగభగలకు రాష్ట్రం అట్టుడుకుతోంది. అధిక వేడితో కూడిన వడగాలులకు ప్రజలు హడలెత్తిపోతున్నారు. బుధవారం రాష్ట్రంలో అత్యధికంగా నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో 46.5, తర్వాత హనుమకొండ జిల్లా ధర్మసాగర్‌లో 46.4, కరీంనగర్ జిల్లా చొప్పదండిలో 46.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 19 జిల్లాల్లో 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైంది. మొత్తం 33 జిల్లాల్లోనూ 40.5 డిగ్రీలకన్నా ఎక్కువగా ఉన్నాయి. అత్యల్పంగా వనపర్తి జిల్లా చిన్నంబావి గ్రామంలో 40.5 డిగ్రీలుంది. అత్యవసర పనుల కోసం బయటకు వెళ్లిన వారు వడదెబ్బకు గురవుతున్నారు. బుధవారం ఒక్కరోజే ఇలా వడదెబ్బ బారిన పడి 11 మంది మృతిచెందారు. వీరిలో రైతులు, ఉపాధి హామీ కూలీలు ఉన్నారు.

పలుచోట్ల పదేళ్ల రికార్డులు తుడిచేసి..

భానుడి ఉగ్రరూపంతో పలుచోట్ల గత పదేళ్ల మే నెల రికార్డులు తుడిచిపెట్టుకుపోయాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పదేళ్ల మే నెలలో అత్యధిక ఉష్ణోగ్రత రికార్డు 2019 మే 24, 29, 30 తేదీల్లో 46.3 డిగ్రీలుండగా బుధవారం అది చెరిగిపోయి దిలావర్‌పూర్‌లో 46.5 డిగ్రీలు నమోదైంది. అలాగే హనుమకొండలో గత పదేళ్ల రికార్డు 2017 మే 22, 23 తేదీల్లో 45 డిగ్రీలుంటే తాజాగా 46.4 డిగ్రీలతో కొత్త రికార్డు నమోదైంది. కుమురం భీం ఆసిఫాబాద్, జనగామ జిల్లాల్లో తీవ్ర వడగాలులు, ఇతర జిల్లాల్లో వడగాలులు వీచినట్లు వాతావరణశాఖ తెలిపింది. సాధారణంకన్నా 6.5 డిగ్రీలకు మించి అదనంగా ఉష్ణోగ్రతలుంటే తీవ్ర వడగాలులు, 4.5 డిగ్రీలకు మించి అదనంగా ఉంటే వడగాలులు వీస్తున్నట్లు వాతావరణశాఖ ప్రకటిస్తుంది. గురువారం నుంచి 25 దాకా రాష్ట్రంలో పలుచోట్ల వడగాలులు వీస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీచేసింది. పగలు ఎండవేడి సమయంలో బయట తిరగరాదని ప్రజలకు సూచించింది. అలాగే ఏపీలోని పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో అత్యధికంగా 47.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

మరింత ముందుకు నైరుతి..

ఎండల వేడి పెరిగినా నైరుతి రుతుపవనాల రాక ఆశాజనకంగా ఉందని వాతావరణశాఖ తెలిపింది. రాబోయే 3, 4 రోజుల్లో తూర్పు, మధ్య బంగాళాఖాతంలోకి ఇవి ప్రవేశించే అవకాశాలున్నట్లు పేర్కొంది. మరోవైపు భూమికి 900 మీటర్ల ఎత్తులో ఉత్తర్‌ప్రదేశ్ నుంచి ఉత్తర తెలంగాణ వరకూ ఉపరితలద్రోణి ఏర్పడింది. దీని కారణంగా తెలంగాణలో అక్కడక్కడ గురువారం ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశాలూ ఉన్నట్లు తెలిపింది.

ఎండల ధాటికి విగతజీవులై..

ఎండల ధాటికి పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నర్సింగాపురానికి చెందిన రైతు సామ లచ్చిరెడ్డి(58), ఓదెల మండలం గుంపుల గ్రామానికి చెందిన ఉపాధిహామీ కూలీ శ్రీపతి లక్ష్మీ(60), పెద్దపల్లి మండలం కొత్తపల్లికి చెందిన కనుకుంట్ల కనకయ్య(77), కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన దివ్యాంగుడు గాజర్ల సతీష్(45), సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం ముక్కుడుదేవులపల్లికి చెందిన బోడ లింగరాజు(34) మృతిచెందారు. ములుగులో మున్సిపల్ కార్మికుడిగా పనిచేస్తున్న బోడ సాంబయ్య(43), మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అర్పనపల్లికి చెందిన ఉపాధిహామీ కూలీ నేరళ్ల సోమయ్య(75), జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం నేలపోగుల గ్రామానికి చెందిన పల్లాటి భిక్షపతి(65), రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం వట్టిమల్ల గొల్లపల్లికి చెందిన రైతు లచ్చవ్వ(58), వేములవాడ మండలం ఆరెపల్లికి చెందిన రాజిరెడ్డి(60), ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం దేవాపూర్ గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ నాయిని పొచ్చన్న(30)లు ప్రాణాలు కోల్పోయారు.

కుల గణన చేస్తే తప్పేంటి?

ఈకబురు,ఢిల్లీ: జనాభా లెక్కల సేకరణలో కుల గణనను చేర్చడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం కొట్టివేసింది. సంక్షేమ చర్యలు తీసుకోవడానికి దేశంలో ఎంత మంది వెనుకబడిన కులాల వారున్నారో ప్రభుత్వానికి తెలియాల్సి ఉంటుందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ పంచోలీ ధర్మాసనం పేర్కొంది. ''జనగణన కుల ప్రాతిపదికన ఉండాలా? వద్దా? అనేది విధానపరమైన నిర్ణయం. ఇందులో జోక్యం చేసుకోవడానికి కారణం కనిపించడంలేదు. కుల గణన చేస్తే తప్పేంటి?'' అని పిటిషనర్‌ను ధర్మాసనం ప్రశ్నించింది. కులాల వారీగా జనాభా సమాచారం ప్రభుత్వం వద్ద చాలా ఉందని పిటిషనర్ సుధాకర్ గుమ్ముల స్వయంగా వాదనలు వినిపించారు.

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం: కాంగ్రెస్

హైదరాబాద్, న్యూస్‌టుడే: జనగణన ప్రక్రియలో కులగణన కూడా చేపట్టాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావులు తెలిపారు. కులగణనను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేస్తూ సుప్రీం ఇచ్చిన తీర్పు సామాజిక న్యాయానికి బలానిచ్చేదిగా ఉందన్నారు. బుధవారం సుప్రీం తీర్పుపై మహేశ్, పొన్నం, వాకిటి వేర్వేరు ప్రకటనల్లో, వీహెచ్ గాంధీభవన్‌లో మాట్లాడారు. 'దేశంలోని వెనుకబడిన వర్గాలకు వారి జనాభా ప్రాతిపదికన న్యాయం జరగాలంటే సమగ్ర కులగణన తప్పనిసరి అని కాంగ్రెస్ పార్టీ ఎప్పటి నుంచో పోరాటం చేస్తోంది. సామాజిక న్యాయం సాధనకు కులగణన కీలకమని రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. తెలంగాణలో చేపట్టిన కుల సర్వే విజయవంతమైంది. కుల గణన నిర్వహించి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి తెలంగాణ ప్రభుత్వం చేసిన బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉంది. కేంద్ర ప్రభుత్వం ఆ బిల్లును ఆమోదింప చేయడంతో పాటు ఆ కుల సర్వే విధానాన్ని ఆదర్శంగా తీసుకుని దేశవ్యాప్తంగా సమగ్ర కుల గణన నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాం' అని వారు పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో హనుమంతరావు ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో సంబరాలు నిర్వహించారు. పార్టీ శ్రేణులు టపాసులు కాల్చి, మిఠాయిలు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు.

ఫ్యూచర్ సిటీలో వెంటనే నిర్మాణాలు!

నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ హైవేల వెంట జీసీసీలు, డేటా సెంటర్లు ఏర్పాటు చేసే కంపెనీలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలి..'అని సీఎం ఆదేశించారు. బుధవారం ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో పరిశ్రమల శాఖ, ఫ్యూచర్ సిటీలో భూ కేటాయింపులు, పరిశ్రమల ఏర్పాటుపై సీఎం సమీక్ష నిర్వహించారు. వివిధ అంశాలపై అధికారులకు ఆదేశాలు, సూచనలు ఇచ్చారు.

ఫ్యూచర్ సిటీలో నెట్ జీరో విధానాలు

'భారత్ ఫ్యూచర్ సిటీ (బీఎఫ్‌సీ)లో ప్రపంచ స్థాయి మౌలిక వసతులతో పాటు పర్యావరణహిత నెట్ జీరో విధానాలు అమలు చేయాలి. ఎక్కడా రాజీ పడొద్దు. అంతర్జాతీయ స్థాయి నగరాలను అధ్యయనం చేయాలి. అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఫ్యూచర్ సిటీకి తీసుకుని రావాలి. మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేసిన తర్వాతే భూ కేటాయింపులు చేయాలి. ఐటీ, ఇతర ఉద్యోగ అవకాశాలు హైదరాబాద్‌కే పరిమితం కాకుండా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు విస్తరించాలి. ''బియాండ్ క్యూర్' (కోర్ అర్బన్ రీజియన్‌కు ఆవలి) ప్రాంతాలను గుర్తించి అక్కడ ఐటీ, డేటా సెంటర్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఐటీ విస్తరణ పెద్దగా లేనిచోట్ల కూడా డేటా సెంటర్ల ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలి. తమిళనాడు, గుజరాత్ పారిశ్రామిక విధానాన్ని కూడా అధ్యయనం చేయాలి. పెట్టుబడిదారులకు ఒకే వేదికపై అన్ని అనుమతులు, సేవలు అందేలా వ్యవస్థ రూపొందించాలి. కేంద్రం ప్రకటించిన ఐదు హెల్త్ క్లస్టర్లలో ఒకటి ఫ్యూచర్ సిటీ వచ్చేలా చర్యలు తీసుకోవాలి. అవసరం అయితే ప్రధాని మోదీని కలిసి హెల్త్ క్లస్టర్ కేటాయించాలని విజ్ఞప్తి చేద్దాం..'అని ముఖ్యమంత్రి చెప్పారు.

ఏఐ సిటీలో పనులు వెంటనే ప్రారంభించాలి

'ఫ్యూచర్ సిటీలో ప్రతిపాదిత ఏఐ సిటీలో పనులను వెంటనే ప్రారంభించాలి. ప్రపంచంలోనే గొప్ప ఏఐ సదుపాయాలుండేలా చూడాలి. ఇక్కడ స్థాపించే కంపెనీలన్నీ నైపుణ్యాభివృద్ధి కోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో ఒప్పందాలు కుదుర్చుకునేలా చూడాలి. 1,500 ఎకరాల్లో డేటా సిటీ ఏర్పాటు చేయాలి. డేటా సిటీ నీటి అవసరాల కోసం మురుగు నీటి నిర్వహణ ప్లాంట్లను (ఎస్‌టీపీలను) వినియోగించాలి.

జీసీసీలు, డేటా సెంటర్ల కోసం కరీంనగర్, వరంగల్, విజయవాడ రోడ్లకు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములు గుర్తించాలి. ప్రజా ప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్టులకు 500 ఎకరాలు కేటాయించాలి. బుల్లెట్ రైల్ కోసం భూ సేకరణ వెంటనే ప్రారంభించాలి. మూడు నెలల్లో ప్రభుత్వ కార్యాలయాలు టీ ఫైబర్‌కు కనెక్ట్ కావాలి..'అని సీఎం ఆదేశించారు.

కాగా ఇప్పటికే టీ ఫైబర్‌కు మారిన ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.54 కోట్ల ఆర్డర్లు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. సమీక్షలో ఐటీ, వాణిజ్య శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ కె.రామకృష్ణారావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ వైస్ చైర్మన్ శశాంక, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి అదనంగా రూ.5 వేల కోట్లు ఇవ్వండి

'సాస్కీ'పథకం కింద....

రాష్ట్రంలో కొనసాగుతున్న మూలధన వ్యయాలు, సంక్షేమ పథకాలకు మద్దతుగా 'సాస్కీ'(ఎస్ఏఎస్‌సీఐ) పథకం

కింద తెలంగాణకు అదనంగా రూ.5,000 కోట్ల ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రిని భట్టి విక్రమార్క కోరారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికిగానూ ఇప్పటికే కేంద్రం రూ.4,208 కోట్లు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం రూ.30,000 కోట్లతో భారీ ప్రణాళికను రూపొందించిందని భట్టి పేర్కొన్నారు.

ఎఫ్ఆర్‌బీఎం నుంచి మినహాయింపు ఇవ్వండి

ఏడీబీ సహకారంతో రూ.4,049.11 కోట్లు, ఏఐఐబీ సహకారంతో రూ.4,903.44 కోట్ల వ్యయంతో చేపట్టే విద్యా ప్రాజెక్టులకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖ ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తం చేశారు. అయితే, ఈ రుణాలను రాష్ట్ర ఎఫ్ఆర్‌బీఎం పరిమితుల నుంచి మినహాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం వెంట ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, ప్లానింగ్ సెక్రెటరీ డాక్టర్ గౌరవ్ ఉప్పల్ ఉన్నారు.

న్యూఢిల్లీ: సింగరేణి సంస్థ భవిష్యత్ ప్రణాళికలు, రాష్ట్ర విద్యుత్ అవసరాలే లక్ష్యంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డితో సమావేశమయ్యారు. కోల్ ఇండియా తరహాలోనే సింగరేణిలోనూ ఆధునిక సాంకేతికతతో 'బొగ్గు గ్యాసిఫికేషన్' ప్రాజెక్టులను చేపట్టేందుకు సంస్థ సిద్ధంగా ఉందని, ఇందుకు కేంద్రం సహకరించాలని కోరారు.

తెలంగాణ విద్యుత్ అవసరాలకు కీలకమైన కొయ్యగూడెం బ్లాక్-3 గత వేలంలో కేటాయించినా నాలుగేళ్లుగా పనులు ప్రారంభం కాలేదని, కాబట్టి దాన్ని సింగరేణికి అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రీ-మైనింగ్ పనులు పూర్తయిన తాడిచెర్ల కోల్ బ్లాక్-2 మైనింగ్ లీజ్ ప్రక్రియను వేగవంతం చేసేలా ముందస్తు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ అంశాలపై త్వరలోనే కేంద్ర, రాష్ట్ర అధికారులు, సింగరేణి ప్రతినిధులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ భేటీలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, సింగరేణి సీఎండీ డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

బంధం బలోపేతం

ఈకబురు, రోమ్: భారత్, ఇటలీ మధ్య బంధం మరింత బలపడింది. ఇరుదేశాలు తమ సంబంధాలను ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంగా మార్చుకున్నాయి. పరస్పర సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని, ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2029 నాటికల్లా 20 బిలియన్ యూరోలకు చేర్చాలని నిర్ణయించుకున్నాయి. రక్షణ పారిశ్రామిక రోడ్‌మ్యాప్‌ను ఖరారు చేశాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ బుధవారం రోమ్‌లో సమావేశమయ్యారు.

అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలను పెంపొందించుకోవాలని తీర్మానించారు. పశ్చిమాసియా సంక్షోభం, తద్వారా ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న సమస్యలపై మోదీ, మెలోనీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడ ఉద్రిక్తతలు సాధ్యమైనంత త్వరగా చల్లారాలని ఆకాంక్షించారు. శాశ్వతమైన శాంతి సాధనకు చర్చలు, దౌత్య మార్గాలే శరణ్యమని తేల్చిచెప్పారు. హార్మూజ్ జలసంధిని తక్షణమే తెరవాలని, స్వేచ్ఛాయుత నౌకాయానానికి వీలు కల్పించాలని ఇరువురు నేతలు విజ్ఞప్తి చేశారు.

ఎఫ్‌టీఏను త్వరగా అమలు చేయాలి

కొన్ని నెలల క్రితం ఖరారైన భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ) ద్వారా లభించే అవకాశాలను సదవినియోగం చేసుకోవాలని మోదీ, వెలోనీ నిర్ణయానికి వచ్చారు. ఆ ఒప్పందాన్ని త్వరగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. జార్జియా మెలోనీతో భేటీ అనంతరం మోదీ ఒక ప్రకటన విడుదల చేశారు. భారత్, ఇటలీ సంబంధాలను ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి చేర్చినందుకు చాలా సంతోషిస్తున్నానని తెలిపారు. 'భారత్-ఇటలీ సంయుక్త వ్యూహాత్మక కార్యాచరణ ప్రణాళిక 2025-29'మన భాగస్వామ్యానికి ఆచరణాత్మక, భవిష్యత్ దృష్టితో కూడిన ఫ్రేమ్‌వర్క్‌ను అందిస్తుందన్నారు. ఉమ్మడి ప్రయత్నాల ద్వారా ఇరుదేశాల ద్వైపాక్షిక వాణిజ్యం 20 బిలియన్ యూరోల లక్ష్యం వైపు వేగంగా దూసుకుపోతోందని హర్షం వ్యక్తంచేశారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో నౌకాయాన స్వేచ్ఛ ఉండాలని మెలోనీ స్పష్టంచేశారు. ఆ ప్రాంతంలో పెరుగుతున్న చైనా ఆధిపత్యాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. భారత్-ఇటలీ సంబంధాలు వ్యూహాత్మక భాగస్వామ్యం నుంచి ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి చేరడం సంతోషంగా ఉందన్నారు.

సాంకేతికత, ఆవిష్కరణలే చోదక శక్తులు

భారత్-ఇటలీ సంయుక్త వ్యూహాత్మక కార్యాచరణ ప్రణాళిక 2025-29ని సమీక్షించి, ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యానికి వ్యూహాత్మక మార్గదర్శకత్వం అందించేందుకు విదేశాంగ మంత్రుల నేతృత్వంలో ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడానికి భారత్, ఇటలీ అంగీకరించాయి. వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, సైన్స్ అండ్ టెక్నాలజీ, పరిశోధన, నూతన ఆవిష్కరణలు, ఇంధనం, కృత్రిమ మేధ(ఏఐ), అరుదైన సాంకేతికతలు, విద్య, సంస్కృతి, ప్రజల మధ్య సంబంధాల విషయంలో సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని మోదీ, మెలోనీ నిర్ణయించారు. రెండుదేశాల భాగస్వామ్యానికి సాంకేతికత, ఆవిష్కరణలే చోదక శక్తులు అని మోదీ స్పష్టంచేశారు. ఏఐ, క్వాంటం, అంతరిక్షం, పౌర అణుశక్తి వంటి రంగాల్లో పరస్పర సహకారానికి అపారమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. రెండు దేశాల్లోని స్టార్టప్‌లు, పరిశోధనా కేంద్రాలు, పరిశ్రమలను అనుసంధానించడానికి ఇండియా-ఇటలీ ఇన్నోవేషన్ సెంటర్‌పై పనిచేస్తున్నామని వివరించారు. రక్షణ రంగంలో ఇరు దేశాల మధ్య సన్నిహిత సహకారం పరస్పర విశ్వాసానికి ప్రతీక అని పేర్కొన్నారు. సముద్ర భద్రతా సహకారం, సమన్వయం, సమాచార మార్పిడి, ఉత్తమ పద్ధతులను పెంపొందించే లక్ష్యంతో సముద్ర భద్రతపై ఒక కార్యాచరణ ప్రారంభించడానికి ఇరుపక్షాలు అంగీకరించాయి.

కొలోజియం సందర్శన

మోదీ మంగళవారం రాత్రి ఇటలీకి చేరుకున్నారు. ప్రధాని మెలోనీ ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం మోదీ గౌరవార్థం ప్రత్యేక విందు ఇచ్చారు. తర్వాత రోమ్‌లోని ప్రాచీన కట్టడం కొలోజియంను ఇరువురు నేతలు కలిసి సందర్శించారు. వేర్వేరు కీలక అంశాలపై తాము అభిప్రాయాలను పంచుకున్నామని మోదీ సోషల్ మీడియాలో పోస్టుచేశారు. ఇదిలా ఉండగా>, ఇటలీ అధ్యక్షుడు సెర్గియో మాలారెల్లాతో మోదీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత, కీలక ఖనిజాలు, ఏఐ, అంతరిక్షం, అణుశక్తి వంటి రంగాల్లో ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని మరింత పెంపొందించుకోవడంపై చర్చలు జరిపారు. మోదీ యూరప్ పర్యటన బుధవారం ముగిసింది.

ప్రధాని మోదీకి ఎఫ్ఏఓ అగ్రికోలా

ప్రధాని మోదీకి ప్రతిష్టాత్మక పతకం లభించింది. ఐక్యరాజ్యసమితికి చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్(ఎఫ్ఏఓ) ఆయనను అగ్రికోలా మెడల్‌తో సత్కరించింది. ఆహార భద్రత, సుస్థిర వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి రంగాల్లో చేసిన విశేషమైన కృషికిగాను మోదీకి ఈ ప్రతిష్టాత్మక పతకం దక్కింది. బుధవారం రోమ్‌లో ఎఫ్ఏఓ

ప్రధాన కార్యాలయంలో ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఖూ డాంగ్‌యూ చేతుల మీదుగా మెడల్ అందుకున్నారు. ఈ గౌరవం ఆహార భద్రత, సుస్థిరాభివృద్ధి పట్ల భారతదేశానికి ఉన్న అచంచలమైన నిబద్ధతను, వ్యవసాయ రంగంతో సంబంధం ఉన్నవారి కృషిని ప్రతిబింబిస్తోందని మోదీ వెల్లడించారు. ఇది భారతదేశంలోని రైతులు, పశుపోషకులు, మత్స్యకారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, కార్మికులకు దక్కిన గొప్ప గౌరవమని అభివర్ణించారు.

సనాతన ధర్మానికి..ఆధునిక ప్రపంచానికి వారధి.. ఆర్ట్ ఆఫ్ లివింగ్

ఏపీలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సేవలు

45 ఏళ్ల క్రితం హ్యాపీ హ్యూమన్ బీయింగ్, స్ట్రెస్ ఫ్రీ సొసైటీ, బెటర్ వరల్డ్ అనే విజన్‌తో ప్రారంభమైన ఆర్ట్ ఆఫ్ లివింగ్ కోట్లాది మందికి ప్రేరణగా నిలిచిందని ముఖ్యమంత్రి అభినందించారు. సురక్షిత తాగునీరు, రివర్ రిజువనేషన్, మహిళా స్వయం సమృద్ధి, విలువలతో కూడిన విద్య వంటి రంగాల్లో ఈ సంస్థ అందిస్తున్న సేవలను ఆయన ప్రశంసించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వంటి సాంకేతికతలు రోజువారీ జీవితంలో తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయని...భౌగోళిక రాజకీయ పరిస్థితులు సామాన్య ప్రజల జీవితాలను కూడా తీవ్ర ఒడిదుడుకులకు గురి చేస్తున్నాయని తెలిపారు. గ్యాస్, ఇంధనం వంటి వనరుల లభ్యత ప్రజలను ఒత్తిడికి గురి చేస్తోందని.. ఈ నేపథ్యంలో ఒత్తిడిని ఎదుర్కొని సమర్ధంగా జీవించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇటువంటి సమయంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ వంటి సంస్థలు మానవాళికి అత్యుత్తమ సేవలు అందించాలని ఆయన కోరారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి వెలసిన నేల ఆంధ్రప్రదేశ్ లో శ్రీశైలం, ఆహోబిలం, అన్నవరం, సింహాచలం వంటి ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాలను కలిగి ఉందని.. ఈ ఆధ్యాత్మికతను మరింత విస్తృతం చేసేలా అభివృద్ధి ప్రణాళికలు చేస్తున్నామని అన్నారు. మరోవైపు దేశానికి ఐటీ మ్యాన్ గా చంద్రబాబు సేవలకు కొలమానం లేదని.. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ చూసినా ఐటీ నిపుణులుగా తెలుగు ప్రజలు కనిపిస్తారని అన్నారు. హైదరాబాద్‌ను ప్రపంచ ఐటీ మేటి నగరంగా ఎదగటంలో సీఎం చంద్రబాబు పాత్ర కీలకమని శ్రీరవిశంకర్ గురూజీ వ్యాఖ్యానించారు.

ఆర్థిక ప్రగతి-ఆనందకరమైన జీవనం

ఆభివృద్ధి అంటే కేవలం ఆర్థిక ప్రగతి, సాంకేతికత మాత్రమే కాదని.. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతి పౌరుడూ శాంతి సౌఖ్యాలు, ఆనందంతో జీవించాలన్నది తన లక్ష్యమని ఆయన తెలిపారు. ఎంత అభివృద్ధి సాధించినా ప్రజల్లో శాంతి సౌఖ్యాలు రావాలంటే ఆధ్యాత్మికత అత్యవసరమని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ వంటి సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతంగా పనిచేయాలని సీఎం కోరారు. అందుకే పీ4 వంటి కార్యక్రమాలు చేపట్టి, స్వర్ణాంధ్ర 2047 విజన్‌ను అమలు చేస్తున్నారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ నిర్మాణమే తన సంకల్పమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అనంతరం శ్రీరవిశంకర్ గురూజీ ఆధ్వర్యంలో కొద్దిసేపు ధ్యాన ప్రక్రియలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి గోవా సీఎం ప్రమోద్ సావంత్, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, బీహార్ రాష్ట్రాల మంత్రులు, మాజీ కేంద్ర మంత్రి సురేష్ ప్రభు తదితరులు హాజరయ్యారు.

అమెరికాది ఆటవిక న్యాయం

ఈకబురు,బీజింగ్: ప్రపంచంపై పట్టుకోసం అమెరికా చేస్తున్నది ఆటవిక న్యాయమని చైనా, రష్యా విరుచుకుపడ్డాయి. ఏ దేశ ఏకఛత్రాధిపత్యం తగదని, ప్రపంచం బహుధ్రువంగా ఉండాలని చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పుతిన్, జిన్‌పింగ్‌లిద్దరూ 'బహు ధ్రువ ప్రపంచ ప్రకటన'పై సంతకాలు చేశారు. అమెరికా గుత్తాధిపత్యాన్ని తిరస్కరించి, దాని ఆధిపత్యానికి వ్యతిరేకంగా దీర్ఘకాలంపాటు కలిసి పనిచేయాలని ఇద్దరు నేతలూ ఉద్ఘాటించారు. ఇటీవలే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఆతిథ్యమిచ్చిన జిన్‌పింగ్.. బుధవారం పుతిన్‌కు బీజింగ్‌లో హార్దిక స్వాగతం పలికారు. ప్రపంచ అధికార వికేంద్రీకరణకు తమ కట్టుబాటును ఇరువురు అగ్రనేతలు పునరుద్ఘాటించారు.

చరిత్రాత్మక అవకాశాన్ని ఒడిసిపట్టే ప్రతిజ్ఞ

''ప్రపంచ వ్యవహారాలను ఒంటిచేత్తో శాసించాలని పలు దేశాలు ప్రయత్నిస్తున్నాయి. వారి ఇష్టాయిష్టాలను ప్రపంచంపై రుద్దాలని చూస్తున్నాయి. ఇతర దేశాల సార్వభౌమ అభివృద్ధికి అడ్డుపడాలని అనుకుంటున్నాయి'' అని అగ్రనేతల ప్రకటన పేర్కొంది. పరస్పర గౌరవం, సమానత్వం, చక్కని విశ్వాసం, ఉభయులకు లబ్ధి కలిగించే సహకారం అనే అంశాలతో చైనారష్యా అనుబంధం పెనవేసుకుందని గుర్తుచేసింది. ప్రపంచంలో మారుతున్న పరిణామాల్లో చరిత్రాత్మక అవకాశాలను ఒడిసిపట్టేందుకు ప్రతిజ్ఞ చేస్తున్నట్లు తెలిపింది. బాధ్యతాయుతమైన గొప్పశక్తిగా పాశ్చాత్య దేశాలు వ్యవహరించడం లేదని, చరిత్రను తిరగతిప్పేలా ఏకపక్ష చర్యలకు ఒడిగడుతున్నాయని జిన్‌పింగ్ చెప్పారు. ఈ చర్యలు కలిగించిన నష్టం అపారమని, ప్రపంచాన్ని మళ్లీ ఆటవిక రాజ్యంలోకి తీసుకువెళ్లేలా ఇవి ఉన్నాయని అన్నారు. 'ఒకే చైనా' అనే విధానానికి పుతిన్ మద్దతు ప్రకటించారు. చైనా నుంచి విడదీయరాని భాగమే తైవాన్ అని, దానికి స్వతంత్రతను ఏ రూపంలోనూ అంగీకరించేది లేదని స్పష్టంచేశారు. ప్రపంచ పాలన స్వరూపాన్ని మార్చాలని ప్రతిజ్ఞ చేస్తూ వాణిజ్యం, సాంకేతికత సహా వివిధ అంశాల్లో 20 ఒప్పందాలపై ఇరుపక్షాలూ సంతకాలు చేశాయి.

పశ్చిమాసియాలో సంక్షోభానికి వెంటనే తెరపడాలి: జిన్‌పింగ్

అమెరికాఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై చేస్తున్న యుద్ధాన్ని ఇరువురు నేతలు వ్యతిరేకించారు. ఈ దాడులు అక్రమమని, పశ్చిమాసియా స్థిరత్వాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ట్రంప్ ప్రతిపాదించిన 'గోల్డెన్ డోమ్ రక్షణ' ప్రతిపాదనను ఈ ప్రకటన విమర్శించింది. అంతర్జాతీయ భద్రతపై తీవ్ర విపరిణామాలకు ఈ డోమ్ కారణమవుతుందని పేర్కొంది. నౌకల రాకపోకలకు ఆటంకాలు కల్పించడం ప్రపంచ వాణిజ్యానికి ముప్పు అని తెలిపింది. పశ్చిమాసియాలో సంక్షోభానికి వెంటనే తెరపడాలని జిన్‌పింగ్ చెప్పారు. పుతిన్‌తో చర్చల సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అంశం కీలక దశకు చేరిందన్నారు. గల్ఫ్‌లో, పశ్చిమాసియాలో పోరు మరింత విస్తృతం కాకుండా అడ్డుకోవాల్సి ఉందని, చర్చలు కొనసాగాలని అభిప్రాయపడ్డారు. ఘర్షణ ఎంత త్వరగా

ముగిస్తే ప్రపంచవ్యాప్త ఇంధన సరఫరాలో అంతరాయాల నుంచి అంత త్వరగా బయటపడగలమని అన్నారు. ప్రపంచ పాలన మరింత న్యాయబద్ధంగా, సముచితంగా ఉండేలా చైనారష్యా కలిసి పనిచేయాలని చెప్పారు. జిన్‌పింగ్ తన ప్రియమిత్రుడని పుతిన్ పేర్కొన్నారు. పాతికేళ్ల క్రితం కుదిరిన చైనారష్యా ఒప్పందాన్ని పొడిగించుకునేందుకు ఇరువురూ అంగీకారం తెలిపారు.

అదే నా చివరి కోరిక

ఫాల్తుగాళ్లు చేసే ప్రచారాన్ని పట్టించుకోను
నా బర్తరఫ్, అరెస్ట్ కేటీఆర్ ఫేక్ మీడియా ఫ్యాక్టరీ సృష్టి
బీఆర్ఎస్ ఎంపీలతో కేంద్రం నడుస్తుందనుకుంటున్నారేమో
బీఆర్ఎస్ గడీలు బద్దలు కొట్టాననే ఆక్రోశంతో కేటీఆర్ ఉన్నారు
ఫేక్ న్యూస్ చూసి జనంనవ్వుకుంటున్నారు
నా కొడుకుపై ఆరోపణలు వస్తే నేను పోలీసులకు అప్పగించా
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్

ఈకబురు,
బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి బుధవారం కేంద్ర మంత్రి బండి సంజయ్ వచ్చారు.సమాచారం తెలిసిన బీజేపీ కార్యకర్తలుభారీ ఎత్తున తరలివచ్చి సంజయ్ కు సంఘీభావం...తెలిపి సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు. బీజేపీ జిందాబాద్, మోదీ జిందాబాద్, బండి సంజయ్ జిందాబాద్, రామచంద్రరావు నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. సంజయ్ ఆప్ సంఘర్ష్ కరో...హమ్ తుమ్హారే సాథ్ హై అంటూ నినదించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ ఉరిశిక్ష వేసే ముందు మీ చివరి కోరిక ఏమిటని బీజేపీలో కమిట్ మెంట్ తో పనిచేసే ఏ కార్యకర్తను అడిగితే చెప్పేది ఒక్కటే ''నేను చచ్చిపోయాక నా శవంపై కాషాయ జెండా కప్పాలని అడుగుతారు. నాది అదే చివరి కోరిక కూడా''. అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. బండి సంజయ్ కొత్త పార్టీపెడుతున్నారంటూ కొందరు ఫాల్తుగాళ్లు ప్రచారం చేస్తున్నారని, అట్లాంటి వాటికి స్పందించాల్సిన అవసరమే లేదని చెప్పారు.

మీడియా అడిగిన ప్రశ్నలకు బదులిచ్చారు...

ప్ర : మీరు కొత్త పార్టీ పెట్టబోతున్నారని కూడా వార్తలొస్తున్నాయి కదా?

బండి సంజయ్ అంటే ఏమిటో మీకు తెలుసు. రాష్ట్రప్రజలకు తెలుసు. కార్యకర్తలందరికీ తెలుసు. ఫాల్తుగాళ్లు చేసే ప్రచారానికి స్పందించాల్సిన అవసరమే లేదు. బీజేపీ అంతర్గత శిక్షణా శిబిరాల్లో ఎంతో మంది కార్యకర్తలను తయారు చేసిన వ్యక్తులం మేం. ఎవరికైనా ఉరి తీయబోయే ముందు చివరి కోరిక అడుగుతారు. బీజేపీలో కమిట్ మెంట్ ఉన్న కార్యకర్తలను ఇదే విషయాన్ని అడిగితే చెప్పేది ఒక్కటే ''నేను చచ్చిపోయాక నా శవంపై కాషాయ జెండా కప్పాలని అడుగుతారు. నాది అదే చివరి కోరిక కూడా''.

ప్ర : మిమ్ముల్ని కేబినెట్ నుండి బర్తరఫ్ చేయబోతున్నారని కొన్ని టీవీలు, డిజిటల్ మీడియాలో వార్తలొస్తున్నాయి కదా?

తెలంగాణలో బీఆర్ఎస్ కు 17 ఎంపీ సీట్లున్నాయి కదా? ఆయన భాగస్వామ్యంతోనే కేంద్రంలోని ఎన్డీఏ నడుస్తోంది కదా? బహుశా నన్ను బర్త్ రఫ్ చేయాలనే నిర్ణయం కేసీఆర్, ఆయన కొడుకే తీసుకున్నట్లున్నారు. ఇంకా ఏమోం చేయబోతున్నారే వాళ్లనే అడగండి (కేసీఆర్, కేటీఆర్ లను ఎద్దేవా చేస్తూ వేసిన సెటైర్) కేసీఆర్ కొడుకు విసిరే చిల్లర మెతుకులకు ఆశపడి

ఒకట్రొండు ఛానళ్లు ఇట్లాంటి కథలను ప్రసారం చేస్తున్నాయి. అది చూసి కేసీఆర్ కొడుకు రాక్షసానందం పొందుతున్నడు. వాళ్ల డ్రుష్టితో చూస్తే నన్ను అరెస్ట్ చేయాల్సిందేమో. ఎందుకంటే... 10 ఏళ్ల బీఆర్ఎస్ గడీల పాలనను బద్దలు కొట్టినం కదా? పదేళ్ల కేసీఆర్ కుటుంబ అవినీతి అరాచక పాలనను బొందపెట్టినం కదా? అధికారం పోయిందనే కోపం వాళ్లకుంటది కదా? అందుకే నన్ను అరెస్ట్ చేయించాలని చూస్తున్నరేమో.

––ప్ర : బండి భగీరథ్ విషయంలో మీరు అధికారాన్ని అడ్డుపెట్టుకుని అరెస్ట్ కాకుండా జాప్యం చేశారనే ఆరోపణలున్నాయి కదా?

కోర్టు పరిధిలో ఉంది. కానీ ఒక్క విషయం గుర్తుంచుకోండి. కన్న కొడుకును ఒక తండ్రి నేరుగా పోలీసులకు అప్పగించిన సందర్భం ఉందా? కానీ నేను విచారణ జరపాలని పోలీసులు కోరితే... నేనే మా అబ్బాయిని పోలీసు విచారణ కోసం అప్పగించా. నేను ప్రజల మధ్య ఉన్నాను కాబట్టే, ప్రజలు బీజేపీతో ఉన్నారు కాబట్టే నన్ను, నా పార్టీని బదనాం చేసేందుకు కేసీఆర్ కొడుకు సోషల్ మీడియాలో ఫేక్ మీడియా ఫ్యాక్టరీ ద్వారా నాపైన ఇట్లాంటి విష ప్రచారం చేయిస్తున్నాడు. ఎన్ని వండి వార్చినా జనం బీజేపీతోనే ఉన్నారు. ఫేక్ వార్తలను, ఫేక్ స్టోరీలను చూసి జనం నవ్వుకుంటున్నారు

మెట్రో రెండో దశకు కేంద్రం

ఈకబురు, దిల్లీ: మెట్రో రెండోదశ ప్రాజెక్టుకు సూత్రప్రాయంగా కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బంది లేదని, నిర్మాణ వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తి భరించే ప్రాతిపదికన ముందుకెళ్లేందుకు సిద్ధంగా ఉందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. హైదరాబాద్‌కు

సంబంధించిన వివిధ కీలక పట్టణాభివృద్ధి ప్రాజెక్టులపై కిషన్‌రెడ్డి బుధవారం ఉదయం దిల్లీలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను ఆయన నివాసంలో కలిసి చర్చించారు. అనంతరం ఒక ప్రకటన విడుదల చేశారు. ''హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టు గురించి ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం ఎల్అండ్‌టీ సంస్థ నుంచి మొదటిదశ ప్రాజెక్టును టేకోవర్ చేసుకున్న నేపథ్యంలో మిగిలిన రెండో దశ పనులకు సంబంధించిన డీపీఆర్, ఇతర సాంకేతిక వివరాలు అందిన తర్వాత సమగ్రంగా పరిశీలించి తదుపరి నిర్ణయం తీసుకుంటామని ఖట్టర్ హామీ ఇచ్చారు. మెట్రో రెండో దశ విషయంలో సూత్రప్రాయంగా కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బంది లేదని, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తిలో ఖర్చు చేసే ప్రాతిపదికన ముందుకెళ్లేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. మెట్రో రెండో దశకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 162 కిలోమీటర్ల పనులకు సంబంధించి ప్రతిపాదనలు సమర్పించిందని,

వాటిని కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి తదుపరి చర్యలు చేపడుతుందన్నారు. మూసీనది పరిశుభ్రతకు సంబంధించిన అంశం ప్రస్తావించినప్పుడు

అమృత్ 2.0 పథకంలో భాగంగా మూసీలో కలుస్తున్న మురుగునీటిని శుద్ధిచేసేందుకు రూ.3,975 కోట్ల విలువైన మొత్తం 39 శుద్ధి ప్లాంట్లను మంజూరు చేసినట్లు గుర్తుచేశారు. వాటికి రోజుకు 972 మిలియన్ లీటర్ల మురుగునీటిని శుద్ధిచేసే సామర్థ్యం ఉందని, ఇది మూసీనది పరిరక్షణ, నగర పారిశుద్ధ్య మెరుగుదలకు ఎంతో దోహదపడుతుందని ఖట్టర్ వివరించారు''

అని కిషన్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ నగరాభివృద్ధి, ప్రజలకు అవసరమైన మౌలికవసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకారం అందిస్తోందని ఖట్టర్ తనతో అన్నట్లు కిషన్‌రెడ్డి వెల్లడించారు. అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపదీముర్మును మంత్రి కిషన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

మోదీ, అమిత్ షా దేశాన్ని అమ్మేశారు

ఈకబురు, రాయ్‌బరేలీ, దిల్లీ: కాంగ్రెస్, భాజపాల మధ్య మాటల యుద్ధం తీవ్రమైంది. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆరెస్సెస్‌లు ద్రోహులని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ విరుచుకుపడగా.. ఆయనది అరాచక మనస్తత్వమంటూ భాజపా ప్రతి దాడి చేసింది.

మోదీ, అమిత్ షా, ఆరెస్సెస్ నేతలు ప్రతి రోజూ రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని, దేశ ప్రయోజనాలను కొంత మంది పారిశ్రామిక వేత్తలకు అమ్మి ద్రోహం చేస్తున్నారని రాహుల్ గాంధీ విమర్శించారు. వీర పసీ అనే స్థానిక యోధుడి స్మారకార్థం బుధవారం రాయ్‌బరేలీలో ఏర్పాటు చేసిన బహుజన్ స్వాభిమాన్ సభలో ఆయన మాట్లాడారు. అనంతరం అమేఠీలో జరిగిన సభలోనూ ప్రసంగించారు. ''మీరు ఎదురు నిలిచి పోరాడండి. ఆరెస్సెస్ కార్యకర్తలు మీ ఇళ్లకు వచ్చి మోదీ, అమిత్ షాల గురించి చెబితే.. వారు ద్రోహులని చెప్పండి. మన దేశాన్ని అమ్మడానికి పని చేస్తున్నారని గుర్తు చేయండి. వారు రోజూ రాజ్యాంగంపై, అంబేద్కర్‌పై, గాంధీజీపై దాడి చేస్తున్నారని తెలపండి'' అని ప్రజలకు సూచించారు.

''మన రాజ్యాంగాన్ని బలహీనపరచడంతో పాటు ధ్వంసం చేసిన వారిని ఏమందాం.. ద్రోహులు అనవద్దా'' అని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలు చేసినందుకు తాను క్షమాపణ చెప్పాలని డిమాండు చేస్తారని, అయినా భయపడేది లేదని రాహుల్ స్పష్టం చేశారు.

''పెద్ద నోట్ల రద్దు, కొవిడ్ సమయంలో మాదిరిగానే టీవీలో ఏడుస్తున్నట్లు మోదీ మళ్లీ నటిస్తారు. వారే రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి మళ్లీ ఏడుపు ముఖం పెడతారు. మహనీయుల విగ్రహాల వద్దకు వెళ్లి చేతులు జోడించడంవల్ల లాభం లేదు. అక్కడి నుంచి వెళ్లగానే వారి సిద్ధాంతాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే అందులో అర్థమేముంది'' అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

భారత ఆర్థిక వ్యవస్థను అదానీ, అంబానీ, అమెరికా చేతిలో మోదీ పెట్టారని విమర్శించారు.

ప్రభుత్వ రంగాన్ని మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరిస్తోందని, ఆరెస్సెస్‌తో సంబంధమున్న వారిని వైస్ ఛాన్సలర్లుగా నియమిస్తోందని రాహుల్ ఆరోపించారు. వారికి సైన్స్, చరిత్ర, జాగ్రఫీపై అవగాహన లేదని విమర్శించారు.

140 కోట్ల మందిని అవమానించారు: భాజపా మోదీ, అమిత్ షాలను ద్రోహులుగా పేర్కొనడం ద్వారా 140 కోట్ల మంది ప్రజలను రాహుల్ గాంధీ అవమానించారని, అది ఆయన అరాచకత్వానికి నిదర్శనమని భాజపా అధ్యక్షుడు నితిన్ నబీన్ వ్యాఖ్యానించారు. రాహుల్ క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. ఎన్నికల్లో ఓడిపోయిన అసహనం ఆయన వ్యాఖ్యల్లో కనిపిస్తోందని తెలిపారు. మానసిక సమతుల్యతను కోల్పోయారని విమర్శించారు. రాహుల్ గాంధీ అర్బన్ నక్సల్ మనస్తత్వానికి ఇది నిదర్శనమని భాజపా అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ వ్యాఖ్యానించారు. ఆయన దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ 'తిరస్కరణకు గురైన మాల్' (పదార్థం) అని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ విమర్శించారు.

ఇజ్రాయెల్ ప్రధాని పదవికి పోటీ చేస్తా: ట్రంప్

ఈ కబురు ; ఇజ్రాయెల్‌లో తనకు 99 శాతం ప్రజాదరణ ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన అధ్యక్ష పదవీ కాలం ముగిసిన అనంతరం అక్కడ ప్రధాని పదవికి కూడా పోటీ చేయొచ్చని చమత్కరించారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడారు. యుద్ధంపై ఇరాన్‌తో ఒప్పందానికి వచ్చే విషయంలో ఎలాంటి తొందర లేదన్నారు.ఇరాన్‌పై దాడుల గురించి ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో ఏం చెప్పారని ట్రంప్ ను విలేకరులు ప్రశ్నించగా.. ఆయన చాలా మంచి వ్యక్తి అని, తాను కోరుకున్నది ఏదైనా చేస్తారని తెలిపారు. ఇజ్రాయెల్‌లో నెతన్యాహును సరిగా ట్రీట్ చేయడం లేదని వ్యాఖ్యానించారు. ఒప్పందం కుదరకుంటే త్వరలోనే ఇరాన్‌పై విరుచుకుపడతామని ట్రంప్ ఇటీవల హెచ్చరించిన విషయం తెలిసిందే. మరోవైపు.. ఇరాన్ (Iran) సాయుధ దళాలు కాల్పుల విరమణ సమయాన్ని తమ శక్తిసామర్థ్యాలను పునరుద్ధరించుకునేందుకు వినియోగించుకున్నాయని ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘాలిబాఫ్ పేర్కొన్నారు. ఇరాన్ ప్రజలు సైన్యంపై భరోసా కలిగి ఉండాలన్నారు. మరో యుద్ధానికి తెరలేపేలా శత్రువు (అమెరికా) కదలికలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. అదే జరిగితే దాడి చేసినవారు పశ్చాత్తాపపడేలా చేస్తామన్నారు.

ఆల్‌టైమ్ కనిష్ఠానికి రూపాయి.. రంగంలోకి ఆర్‌బీఐ

దిల్లీ: దేశీయ కరెన్సీ రూపాయి విలువ రోజురోజుకూ క్షీణిస్తున్న వేళ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) కీలక నిర్ణయం తీసుకుంది. బ్యాంకింగ్ వ్యవస్థలోకి నగదు లభ్యతను పెంచేందుకు 5 బిలియన్ డాలర్ల విలువైన డాలరురూపాయి బై, సెల్ స్వాప్ వేలాన్ని చేపట్టనుంది. మే 26న ఈ వేలం ప్రక్రియ నిర్వహించనున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితుల నేపథ్యంలో రూపాయి విలువ పతనమవుతున్న నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత, మారుతున్న పరిస్థితుల్లో సమీక్షించాక మూడేళ్ల కాలపరిమితితో యూఎస్‌డీ/ఐఎన్‌ఆర్ బై/ సెల్ స్వాప్ వేలాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆర్‌బీఐ తన సర్క్యులర్‌లో పేర్కొంది.

ఏమిటీ స్వాప్?

మార్కెట్‌లో నగదు లభ్యతను పెంచేందుకు ఆర్‌బీఐ ఎప్పటికప్పుడు బై/సెల్ స్వాప్ విధానాన్ని అనుసరిస్తుంటుంది. ఈ విధానంలో వాణిజ్య బ్యాంకులు తమ వద్ద ఉన్న డాలర్లను ఆర్‌బీఐకి విక్రయించి, దానికి సమానమైన రూపాయిలను పొందుతాయి. 3 ఏళ్ల గడువు ముగిసిన తర్వాత అదే మొత్తంలో డాలర్లను ముందే నిర్ణయించిన ప్రీమియం ధరతో తిరిగి కొనుగోలు చేయడానికి బ్యాంకులు ఒప్పందం చేసుకుంటాయి. ఈ వేలం ద్వారా బ్యాంకుల వద్ద రూపాయిల లభ్యత పెరగడమే కాకుండా, విదేశీ మారక నిల్వలు బలోపేతం అయ్యి, రూపాయి పతనం ఆగుతుంది. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితులు, ఇరాన్ యుద్ధ ప్రభావం, ముడిచమురు ధరల పెరుగుదల వల్ల రూపాయి విలువ రికార్డు స్థాయిలో బలహీనపడిన నేపథ్యంలో మరింత పడిపోకుండా ఈ స్వాప్ తోడ్పడుతుంది. కనీస బిడ్ సైజ్ 10 మిలియన్ డాలర్లుగా ఆర్‌బీఐ పేర్కొంది.

భారీగా తగ్గుముఖం పట్టిన ఓలా ఎలక్ట్రిక్ ఆదాయం

ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ త్రైమాసిక ఫలితాలను విడుదల చేసింది. 202526 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికి గానూ రూ.500 కోట్ల ఏకీకృత నికర నష్టాన్ని నమోదు చేసింది. అంతకుముందు ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.870 కోట్లతో పోలిస్తే 42.5% నష్టం తగ్గుముఖం పట్టింది. సమీక్షా త్రైమాసికంలో కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం రూ.265 కోట్లుగా నమోదైంది. గతేడాది ఇదే సమయంలో ఆదాయం రూ.611 కోట్లతో పోలిస్తే 56.62% తగ్గినట్లు ఓలా రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.2,253 కోట్లు ఆదాయం ఆర్జించినట్లు తెలిపింది. క్యూ4లో ఏకీకృత స్థూల మార్జిన్ 38.5 శాతం కాగా.. పూర్తి ఆర్థిక సంవత్సరానికి 30.6 శాతంగా ఉందని ఓలా ఎలక్ట్రిక్ తెలిపింది. నాలుగో త్రైమాసికంలో 20,256 యూనిట్లను విక్రయించినట్లు తెలిపింది. మొత్తం త్రైమాసికానికి రూ.1,73,794 యూనిట్లు అమ్ముడైనట్లు పేర్కొంది. బుధవారం ట్రేడింగ్ సెషన్‌లో ఓలా ఎలక్ట్రిక్ షేరు విలువ ఒక శాతం పెరిగి రూ.36.94 వద్ద ముగిసింది.

అపోలో హాస్పిటల్స్ లాభం రూ.551 కోట్లు

హైదరాబాద్: అపోలో హాస్పిటల్స్, మార్చి త్రైమాసికంలో రూ.6,605.5 కోట్ల ఆదాయంపై రూ.551.3 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాలంలో ఆదాయం రూ.5,592.2 కోట్లు, నికర లాభం రూ.414.5 కోట్లుగా ఉన్నాయి. వీటితో పోలిస్తే, ఈసారి ఆదాయం 18%, నికర లాభం 33% పెరిగాయి. 2025-26 పూర్తి ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ.25,229 కోట్లు, నికర లాభం రూ.1,942 కోట్లుగా ఉన్నాయి. రూ.5 ముఖ విలువ ఉన్న ఒక్కో షేరుపై రూ.10 చొప్పున తుది డివిడెండ్‌ను కంపెనీ బోర్డు ప్రతిపాదించింది. సంస్థాగత మార్పుల్లో భాగంగా, తమ పూర్తి అనుబంధ సంస్థ అపోలో హాస్పిటల్స్ నార్త్ లిమిటెడ్‌ను మాతృ సంస్థలో విలీనం చేసేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. మాతాశిశు సంరక్షణ విభాగంలో దేశంలోనే అతి పెద్ద నెట్‌వర్క్ సృష్టించే లక్ష్యంతో, అపోలో హెల్త్ అండ్ లైఫ్‌స్టైల్ సంస్థ క్లౌడ్‌నైన్ (కిడ్స్ క్లినిక్ ఇండియా)తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఇందుకోసం క్లౌడ్‌నైన్‌లో 9.9% ఈక్విటీ వాటాను అపోలో దక్కించుకోనుంది.

ఇంటి నుంచి పని అంటూ.. 8,000 మందికి మెటా లేఆఫ్

ఉద్యోగులకు ఇ-మెయిల్ ద్వారా సమాచారం

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్ మాతృసంస్థ మెటా ప్లాట్‌ఫామ్స్.. ప్రపంచవ్యాప్తంగా 8,000 ఉద్యోగాల తొలగింపు ప్రక్రియను ప్రారంభించినట్లుగా తెలుస్తోంది. ఐరోపా, అమెరికా, సింగపూర్‌లలో కొందరు ఉద్యోగులకు 'ఇంటి నుంచి పని'కి అవకాశం కల్పించి.. తదుపరి ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు 'ఇమెయిల్' ద్వారా సమాచారాన్ని మెటా పంపిందని ఆంగ్ల పత్రికలు తెలిపాయి. ఇంజినీరింగ్, ప్రోడక్ట్ బృందాల్లో తాజా ఉద్యోగాల కోత ఎక్కువగా ఉందని వెల్లడించింది. ఈ ఏడాదిలో మరికొంత మందిని తొలగించే అవకాశాలున్నాయనీ చెబుతున్నారు. వ్యయాలు తగ్గించుకునేందుకు, ఏఐ ఆధారిత ఉత్పాదకత పెంచుకునేందుకు 8,000 మంది సిబ్బందిని తొలగించే యోచనలో ఉన్నట్లు మెటా ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. కృత్రిమ మేధ వ్యవస్థలపై 100 బిలియన్ డాలర్ల (సుమారు రూ.9.6 లక్షల కోట్ల) మూలధన వ్యయాన్ని మెటా వెచ్చించనుంది. ఏఐ ఆధారిత కార్యకలాపాలపై దృష్టి సారించేందుకు కొత్తగా ఏర్పాటు చేసిన బృందాలలోకి 7,000 మంది సిబ్బందిని మెటా బదిలీ చేసింది. తాజాగా తొలగించిన 8,000 మంది ఉద్యోగుల్లో తొలుత సింగపూర్‌లో పనిచేసే వారికి, స్థానిక సమయం ప్రకారం ఉదయం 4 గంటలకే ఇమెయిల్ రూపంలో ఉత్తర్వులు అందాయి. ఐరోపా, అమెరికా ఉద్యోగులకూ ఇదే విధానాన్ని అనుసరిస్తున్నట్లు తెలుస్తోంది. మార్చి చివరికి మెటాలో సుమారు 80,000 మంది ఉద్యోగులున్నారు. అంటే 10% మందిపై తాజా వేటు పడుతోంది. వేగంగా, మరింత జవాబుదారీతనంతో పనిచేసే చిన్న బృందాలతో ముందుకు వెళ్లాలని అనుకుంటున్నట్లు ఉద్యోగులకు ఇంటర్నల్ మెమోలో మెటా పేర్కొన్నట్లు సమాచారం.

జీతం నుంచే నేరుగా మ్యూచువల్ ఫండ్లలోకి..

సెబీ కీలక ప్రతిపాదనలు

హైదరాబాద్: మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడుల విధానాన్ని మరింత సులభతరం చేసే దిశగా మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ కీలక అడుగు వేసింది. తగిన రక్షణ చర్యలతో, కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మూడో వ్యక్తి చెల్లింపులనూ అనుమతించాలని ప్రతిపాదించింది. ప్రధానంగా, ఉద్యోగుల తరఫున యాజమాన్యాలు చేసే చెల్లింపులు, అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు (ఏఎంసీలు) డిస్ట్రిబ్యూటర్లకు ఇచ్చే కమీషన్లు థర్డ్‌పార్టీ చెల్లింపుల పరిధిలోకి వస్తాయని వెల్లడించింది.

ప్రస్తుతం ఇలా: ప్రస్తుత నిబంధన ప్రకారం, మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెట్టేందుకు చెల్లింపులు.. నేరుగా మదుపరుల సొంత బ్యాంకు ఖాతా నుంచే జరగాలి. ఈ లావాదేవీలన్నీ ఆర్‌బీఐ ఆమోదించిన చెల్లింపుల వ్యవస్థలు, సెబీ గుర్తింపు పొందిన క్లియరింగ్ కార్పొరేషన్ల ద్వారా మాత్రమే సాగాలి. ఈ విషయంలో పరిశ్రమ వర్గాల నుంచి కొంతకాలంగా వస్తున్న సూచనల ఆధారంగా, ఈ విధానాన్ని సమీక్షించాలని సెబీ నిర్ణయించింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం నిబంధనలకు లోబడి, మదుపరుల ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలగకుండా, కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మూడో పక్షం చెల్లింపులకు వెసులుబాటు కల్పించాలని తాజాగా ప్రతిపాదించింది. మదుపరులకు పెట్టుబడులను సులభతరం చేయడంతో పాటు, ఈ విధానం దుర్వినియోగం కాకుండా, పటిష్ఠమైన రక్షణ కవచాన్ని ఏర్పాటు చేయడమే తమ లక్ష్యమని సెబీ స్పష్టం చేసింది.

ఉద్యోగుల తరఫున యాజమాన్యాలు: ఉద్యోగుల జీతాల నుంచి కొంత మొత్తాన్ని మినహాయించి, వారి తరఫున యాజమాన్యాలు నేరుగా మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెట్టొచ్చు. ఉద్యోగులకు యాజమాన్యాలు కల్పించే పొదుపు, వివిధ ప్రయోజనాల విధానాలకు అనుగుణంగా సెబీ దీనిని ప్రతిపాదించింది. ఈ విధానం ద్వారా ఏఎంసీలు జీతాల కోత ద్వారా వచ్చే సమీకృత చెల్లింపులను సులభంగా స్వీకరించొచ్చు.

పంపిణీదారులకు యూనిట్ల రూపంలో: ఏఎంసీలు మ్యూచువల్ ఫండ్ పంపిణీదారుల (డిస్ట్రిబ్యూటర్ల)కు ఇచ్చే ట్రయల్ కమీషన్‌కు బదులుగా, ఆ మొత్తాన్ని మ్యూచువల్ ఫండ్ యూనిట్ల రూపంలో చెల్లించే విధానాన్ని సెబీ ప్రతిపాదించింది. ఏఎంసీ, డిస్ట్రిబ్యూటర్ల మధ్య అంగీకారంతో ఇలా యూనిట్లను కేటాయించడం వల్ల, పంపిణీదారులూ దీర్ఘకాలికంగా పొదుపు, పెట్టుబడులు పెట్టేందుకు ప్రోత్సాహం లభిస్తుందన్నది సెబీ అంచనా.

దుర్వినియోగం కాకుండా....

థర్డ్‌పార్టీ చెల్లింపుల్లో మనీ లాండరింగ్‌లాంటి వాటిని నిరోధించేందుకు సెబీ కఠిన రక్షణ చర్యలు ప్రతిపాదించింది. చెల్లింపులు చేసే వ్యక్తి, లబ్ధిదారుడు ఇద్దరికీ పటిష్ఠమైన కేవైసీ తప్పనిసరి. సంబంధిత వ్యక్తుల నుంచి స్పష్టమైన రాతపూర్వక అనుమతి తీసుకోవాలి. నగదు రూపంలో కాకుండా, ఆడిట్ చేయడానికి వీలుండేలా ప్రత్యేక ఖాతాల ద్వారా నగదు రహిత డిజిటల్ నిధుల బదిలీ మాత్రమే జరగాలి. ఎప్పటికప్పుడు ఈ లావాదేవీలను సరిచూసుకోవాలి. ఏఎంసీలు తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు పారదర్శకత పాటించాలి. లబ్ధిదారులకు తమ పెట్టుబడులను స్వేచ్ఛగా ఉపసంహరించుకునే పూర్తి సదుపాయాన్ని కల్పించాలని సెబీ స్పష్టం చేసింది. ఈ ముసాయిదాపై జూన్ 10 వరకు ప్రజలు, సంబంధిత వర్గాలు తమ అభిప్రాయాలు సెబీకి తెలియజేయొచ్చు.

సూచీలకు స్వల్ప లాభాలు

డాలర్ @ రూ.96.86

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.926.15 కోట్లు

డీఐఐ కొనుగోళ్లు: రూ.1,339.25 కోట్లు

ముడి చమురు అధిక ధరలు, బలహీన రూపాయి కారణంగా మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించినా, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ల ర్యాలీ ఫలితంగా దేశీయ సూచీలు బుధవారం ప్రారంభ నష్టాల నుంచి కోలుకుని స్వల్ప లాభాల్లో ముగిశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి విలువ 16 పైసలు నష్టపోయి 96.86 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఒక దశలో 96.95 వద్ద రికార్డు కనిష్ఠాన్ని తాకింది కూడా. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 6% నష్టంతో 104 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, షాంఘై, హాంకాంగ్ సూచీలు నష్టపోయాయి. ఐరోపా మార్కెట్లు సానుకూలంగా కదలాడాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.1.4 లక్షల కోట్లు పెరిగి, రూ.461.05 లక్షల కోట్ల (4.76 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. సెన్సెక్స్ ఉదయం 74,806.49 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 75,200.85 పాయింట్లు) ప్రతికూలంగా ప్రారంభమైంది. ఒక దశలో 74,529.41 పాయింట్ల కనిష్ఠ స్థాయిని తాకింది. చివర్లో లభించిన కొనుగోళ్ల మద్దతుతో ఒక దశలో 75,406.18 పాయింట్ల గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 117.54 పాయింట్ల లాభంతో 75,318.39 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సైతం 41 పాయింట్లు పెరిగి 23,659 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 23,397.30 23,690.90 పాయింట్ల మధ్య కదలాడింది. సెన్సెక్స్ 30 షేర్లలో 15 లాభపడ్డాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.83%, బజాజ్ ఫిన్‌సర్వ్ 1.29%, ఎం అండ్ ఎం 1.01%, యాక్సిస్ బ్యాంక్ 0.89%, ఎన్‌టీపీసీ 0.86%, ఇండిగో 0.76%, ట్రెంట్ 0.74%, అదానీ పోర్ట్స్ 0.62% చొప్పున పెరిగాయి. బీఈఎల్ 2.30%, టెక్ మహీంద్రా 1.85%, ఎటర్నల్ 1.52%, టాటా స్టీల్ 1.08%, హెచ్‌యూఎల్ 1.03%, ఐటీసీ 0.89%, హెచ్‌సీఎల్ టెక్ 0.79% మేర తగ్గాయి. రంగాల వారీ సూచీలకొస్తే విద్యుత్, చమురుగ్యాస్, భారీ యంత్ర పరికరాలు, ఇంధన, పారిశ్రామిక, వాహన రంగాలు రాణించాయి. ఎఫ్ఎంసీజీ, ఫోకస్డ్ ఐటీ, ఐటీ, మన్నికైన వినిమయ వస్తువులు డీలాపడ్డాయి. బీఎస్ఈలో 2,035 షేర్లు సానుకూలంగా, 2,084 షేర్లు ప్రతికూలంగా ముగిశాయి. 191 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. రూ.50,688 కోట్లు పెరిగిన ఆర్ఐఎల్ మార్కెట్ విలువ: రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) షేరు బీఎస్ఈలో 2.83% పెరిగి రూ.1,359.75 వద్ద ముగిసింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ 50,668.1 కోట్లు పెరిగి రూ.18.40 లక్షల కోట్లకు చేరింది.

పార్లే పేరుందని ఆ షేరు కొనేశారు!

భారత ప్రధాని మోదీ మంచి 'మెలోడీ టోఫీల'ను తనకు బహుమతిగా అందించారని ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ చేసిన వీడియో పోస్టుకు విపరీతమైన ప్రాచుర్యం లభించింది. అంతే మెలోడీ టోఫీలను తయారు చేసే పార్లే ప్రోడక్ట్స్ అనుకుని, పార్లే ఇండస్ట్రీస్ షేర్లను మన స్టాక్‌మార్కెట్లో మదుపర్లు కొనేశారు. వాస్తవానికి పార్లే ప్రోడక్ట్స్ స్టాక్‌మార్కెట్లో నమోదు కాలేదు. గందరగోళానికి గురైన మదుపర్లు ఆసక్తి చూపడంతో పార్లే ఇండస్ట్రీస్ షేరు బుధవారం బీఎస్ఈలో 5% పెరిగి రూ. 5.25 వద్ద అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. 'భారతీయ ఉత్పత్తులకు ప్రపంచ వేదిక కల్పించడానికి ప్రధాని పర్యటన ఉపయోగ పడుతోంద'ని పార్లే ప్రోడక్ట్స్ వైస్ ప్రెసిడెంట్ మయాంక్ షా వెల్లడించారు. ఈ సంస్థ నుంచి మెలోడీతో పాటు పార్లేజీ, మొనాకో, క్రాక్‌జాక్, హైడ్ అండ్ సీక్, కచ్చా మ్యాంగో బైట్ వంటి బ్రాండ్లు ఉత్పత్తి అవుతున్నాయి.

గ్రాసిమ్ డివిడెండ్ 500%

దిల్లీ: ఆదిత్య బిర్లా గ్రూపు సంస్థ గ్రాసిమ్ ఇండస్ట్రీస్, జనవరి మార్చి త్రైమాసికానికి ఏకీకృత ప్రాతిపదికన రూ.3,802.23 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 202425 ఇదే కాల లాభం రూ.2,973.26 కోట్లతో పోలిస్తే ఇది 27.8% అధికం. భవన నిర్మాణ సామగ్రి, ఆర్థిక సేవలు, సెల్యులాజిక్ ఫైబర్స్ వ్యాపారాలు రాణించడం ఇందుకు తోడ్పడింది. కార్యకలాపాల ఆదాయం రూ.44,267.20 కోట్ల నుంచి 15.43% పెరిగి రూ.51,101.11 కోట్లకు చేరింది. ఒక త్రైమాసికంలో తమకు ఇదే అత్యధిక ఆదాయమని కంపెనీ తెలిపింది. మొత్తం వ్యయాలూ 13.55% పెరిగి రూ.46,281.78 కోట్లుగా నమోదయ్యాయి. ఇతర వనరుల ద్వారా వచ్చిన ఆదాయంతో కలిపి మొత్తం ఆదాయం రూ.51,328.60 కోట్లుగా ఉంది. ఏడాది క్రితం ఇదే సమయంతో పోలిస్తే 14.9% పెరిగింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి (202526) గ్రాసిమ్ ఇండస్ట్రీస్ నికర లాభం 32.8% పెరిగి రూ.10,300.29 కోట్లకు చేరింది. 2024 25 లాభం రూ.7,756.33 కోట్లు మాత్రమే. ఇదే సమయంలో మొత్తం ఏకీకృత ఆదాయం 17.8% వృద్ధితో రూ.1,76,610.80 కోట్లకు చేరింది. ఇది కూడా తమకు జీవనకాల గరిష్ఠమేనని కంపెనీ తెలిపింది. అన్ని వ్యాపారాల విభాగాలు రాణించడం ఇందుకు తోడ్పడినట్లు వివరించింది. 202526 ఆర్థిక సంవత్సరానికి రూ.2 ముఖ విలువ గల ఒక్కో షేరుకు రూ.10 (500%) డివిడెండు చెల్లించేందుకు డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులోనూ 2 రోజులు ఇంటి నుంచి పని

వ్యాపార, కార్పొరేట్ విభాగాల్లోని కొందరు ఉద్యోగులకు వారానికి 2 రోజుల పాటు ఇంటి నుంచి పని చేసే విధానాన్ని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అమల్లోకి తెచ్చింది. ట్రెజరీ కార్యకలాపాలు, క్రెడిట్ అండర్‌రైటింగ్ అండ్ రిస్క్, ట్రాన్సాక్షన్ బ్యాంకింగ్, డిజిటల్ బ్యాంకింగ్, ఐటీ సేవలు, మానవ వనరుల విభాగం, ఆర్థిక, న్యాయ విభాగాలు, సెక్రటేరియల్‌బోర్డు విధుల్లో ఉన్న వారికి ఇది వర్తించనుంది. నెల రోజుల పాటు ఈ విధానాన్ని అమలు చేశాక, సమీక్షిస్తామని పేర్కొంది. ముడిచమురును పొదుపు చేసేందుకు 'వీలైనంతమంది ఉద్యోగులకు ఇంటి నుంచి పని'కి అవకాశం కల్పించాలని ప్రధాని మోదీ ఇటీవల సూచించిన నేపథ్యంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్పందించింది. అయితే శాఖలు, ఖాతాదార్ల టచ్ పాయింట్లన్నీ యథాతథంగా పనిచేస్తాయని వెల్లడించింది.

తొందరపడి బాధపడే కన్నా.. ఇదే మేలు!

సరైన సమయానికి జీవితంలోకి రావాల్సిన వ్యక్తి తప్పకుండా వస్తాడంటోంది బాలీవుడ్ కథానాయిక సారా అలీఖాన్. 'పతీ పత్ని ఔర్ వో దో' చిత్రంతో థియేటర్లలో ప్రేక్షకుల్ని అలరిస్తున్న ఈమె తాజాగా ఓ ఇంటర్వ్యూలో కెరీర్‌తో పాటు పెళ్లి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ''పెరిగిన వాతావరణం.. చుట్టూ చూసే సంఘటనల వల్ల కలిగే అనుభూతి మనలో ఎన్నో ఆలోచనలు రేకెత్తిస్తుంది. నేను ఎన్నో వివాహ బంధాలు మధ్యలోనే ముగిసిపోవడం చూశాను. అందుకే హడావుడిగా పెళ్లి చేసుకుని బాధపడే కంటే కాస్త సమయం తీసుకుని సరైన వ్యక్తి దొరికే వరకు వేచి చూడటం ఉత్తమం. పెళ్లితోనే నేను పరిపూర్ణం అవుతానను కోవడం లేదు. సొంతంగా ఎదగడానికి ప్రాధాన్యత ఇస్తాను. ప్రస్తుతం నా దృష్టి పూర్తిగా కెరీర్ పైనే ఉంది. ఈలోగా సరైన వ్యక్తి రావాలని రాసిపెట్టి ఉంటే వారే వస్తారు. పెళ్లి చేసుకోకుండా హాయిగా ఉండేందుకు నాలో చాలా లక్షణాలున్నాయి. అందుకే ఇలాంటి విషయాలలో తొందరపడకుండా ఉండడానికే ప్రయత్నిస్తాను. కొన్నిసార్లు నా సొంత ఆలోచనల్లో మునిగిపోతాను'' అని చెప్పుకొచ్చింది సారా.



ఆగస్టులో దుల్కర్ గేమ్

దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'ఐ యామ్ గేమ్' ఆగస్టు 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. నహాస్ హిదాయత్ దర్శకత్వంలో... దక్షిణ భారతదేశంలోని వందకుపైగా లొకేషన్లలో చిత్రీకరించిన సినిమా ఇది. దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. షహబాస్ రషీద్, ఆదర్శ్ సుకుమారన్ కథని రచించారు. మలయాళ సినీ చరిత్రలోనే అత్యంత భారీస్థాయిలో రూపొందుతున్న చిత్రాల్లో ఇదొకటిగా నిలుస్తుందని, దుల్కర్ సల్మాన్ మాస్ అవతారంలో కనిపించనున్నారని సినీ వర్గాలు తెలిపాయి. ఆంటోనీ వర్గీస్, మిస్కిన్, కయాదు లోహర్, కతిర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రం తెలుగుతోపాటు తమిళ, హిందీ, కన్నడ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఒక్కసారి మోసం చేస్తే జీవితాంతం క్షమించకూడదా?

తెలిసో తెలియకో ఏదో ఒకసారి చీటింగ్ చేస్తే తప్పేం కాదంటోంది హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్. అలా అని మోసం చేయడాన్ని తాను సమర్థించడం లేదని చెప్తోంది. రకుల్ కథానాయికగా నటించిన తాజా చిత్రం 'పతీ పత్నీ ఔర్ వో దో'. ఇటీవల రిలీజైన ఈ హిందీ సినిమా ఇప్పటివరకు రూ.30 కోట్లకు పైగా రాబట్టింది. పాజిటివ్ టాక్‌తో థియేటర్లలో విజయవంతంగా ఆడుతోంది.

మోసం చేస్తే?

ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా హీరో ఆయుష్మాన్ ఖురానా, హీరోయిన్లు సారా అలీ ఖాన్, రకుల్ ప్రీత్ ఓ ఇంటర్వ్యూకు హాజరయ్యారు. రిలేషన్‌షిప్‌లో ఉన్నప్పుడు పార్ట్‌నర్ మోసం చేస్తే ఒప్పుకుంటారా? అన్న ప్రశ్నకు ముగ్గురూ విభిన్నంగా స్పందించారు. మొదటగా సారా అలీ ఖాన్.. మోసం చేయడం సరికాదు, కానీ మోసం జరిగితే మాత్రం కచ్చితంగా సారీ చెప్పాలి అంది. దానికి రకుల్ కూడా అవునని వంత పాడింది. అయితే ఆయుష్మాన్ ఖురానా మాత్రం పెళ్లయ్యాక ప్రత్యేక షరతులుంటాయి.

మానవ సహజం

ఒకవేళ ఏదైనా పొరపాటు జరిగి, దానికి బాధపడుతూ నిజాయితీగా సారీ చెప్పినప్పుడు క్షమించేయడమే ఉత్తమం. మనిషన్నాక చిన్నపాటి పొరపాట్లు చేస్తూనే ఉంటాడు. వాటిని పెద్దగా చూడకూడదు. అయితే పొరపాట్లు చేయడమే పనిగా పెట్టుకోవడం మాత్రం సరికాదు అన్నాడు. అలాగైతే ఒకసారి చీట్ చేస్తే క్షమించేయొచ్చా? అని సారా అడగ్గా కుదరదని రకుల్ బదులిచ్చింది.

అది సరికాదు

కానీ, అంతలోనే మళ్లీ మాట మార్చేసింది. 'ఎవరైనా అనుకోకుండా పొరపాటు చేస్తే మాత్రం క్షమించేయొచ్చు. ఎందుకంటే జీవితం చాలా పెద్దది. ఒక్క పొరపాటు చేసినందుకు జీవితాంతం అవతలి వ్యక్తిని క్షమించకుండా ఉండటం కరెక్ట్ కాదు. అలా అని ఇది నా జీవితానికి, నా భర్తకు వర్తించదు' అని రకుల్ పేర్కొంది.

'ధురంధర్ 2'.. దేశ భద్రతకు ముప్పంటూ పిల్.. హైకోర్టు కీలక ఆదేశం

బాక్సాఫీసు వద్ద రికార్డు సృష్టించిన 'ధురంధర్ 2' (Dhurandhar 2)కు ఇప్పుడు ఓ చిక్కు ఎదురైంది. ఈ సినిమాలో సాయుధ దళాల కార్యకలాపాల వివరాలను బహిర్గతం చేశారని, దీనివల్ల దేశ భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందంటూ దిల్లీ హైకోర్టులో పిల్ దాఖలైంది. సశస్త్ర సీమా బల్ (SSB)లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న దీపక్ కుమార్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై బుధవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం.. ఆ సినిమా కల్పిత కథ కావచ్చని, కానీ భద్రతాదళ సిబ్బంది లేవనెత్తిన ఆందోళనలనూ విస్మరించలేమని వ్యాఖ్యానించింది. ఈ ఆరోపణలపై విచారణ జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (CBFC)ని ఆదేశించింది. ఈ సినిమా స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన సంగతి తెలిసిందే. రణ్‌వీర్ సింగ్ హీరోగా దర్శకుడు ఆదిత్యధర్ తెరకెక్కించిన ఈ చిత్రం మార్చిలో విడుదలై, రూ.1800 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టింది. విదేశాల్లో ఇప్పటికే 'నెట్‌ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ మూవీ.. భారత్‌లో జూన్ 5 (Dhurandhar 2 Streaming Date in India) నుంచి ఓటీటీ 'జియో హాట్‌స్టార్'లో స్ట్రీమింగ్ కానుంది. జూన్ 4న రాత్రి 7గంటలకు డిజిటల్ ప్రీమియర్ ఉండనుంది.

గర్జన మరింత గట్టిగా!

అగ్ర కథానాయకుడు బాలకృష్ణ 111వ సినిమాలో మంచు మనోజ్ నటించనున్నారు. చాలా రోజులుగా ప్రచారంలో ఉన్న ఈ విషయాన్ని బుధవారం అధికారికంగా ప్రకటించింది నిర్మాణ సంస్థ. మంచు మనోజ్ చేరికతో ఎన్.బి.కె.111 గర్జన మరింత గట్టిగా వినిపించబోతోంది అంటూ నిర్మాణ సంస్థ సామాజిక మాధ్యమాల వేదికగా తెలిపింది. బాలకృష్ణ కథానాయకుడిగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో ఓ శక్తిమంతమైన పాత్రని మంచు మనోజ్ పోషిస్తున్నట్టు సినీ వర్గాలు తెలిపాయి. ఆ పాత్రలో ఆయన ప్రతినాయకుడిగా కనిపిస్తారా లేక, మరో కోణంలో కనిపిస్తారా అనేది తెలియాలంటే కొన్నాళ్లు వేచి చూడాల్సిందే. బాలకృష్ణ - మంచు మనోజ్ కలిసి నటిస్తున్న రెండో చిత్రమిది. ఇదివరకు 'ఊ కొడతారా ఉలిక్కిపడతారా' సినిమాలో నటించారు.

కొత్త చిత్రం... 'వడ్డీ కాసులవాడ'

విజయవంతమైన 'బిందాస్' తర్వాత మంచు మనోజ్ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ కలయికలో రూపొందుతున్న సినిమా... 'వడ్డీ కాసులవాడ'. తేజ్ ఉప్పలపాటి దర్శకత్వం వహిస్తున్నారు. రామబ్రహ్మం సుంకర నిర్మాత. మంచు మనోజ్ పుట్టినరోజుని పురస్కరించుకుని బుధవారం ఈ సినిమాని ఓ ప్రత్యేకమైన వీడియో ద్వారా విడుదల చేసింది చిత్రబృందం. ఈసారి ఫైట్‌స్‌తో కాకుండా, ఫన్‌తో మీ దగ్గరకు వస్తున్నా... అంటూ వీడియోలో మనోజ్ చేసిన సందడి ఈ సినిమా ఎలా ఉంటుందో చాటుతోంది. త్వరలోనే సినిమాకి సంబంధించిన మరిన్ని వివరాల్ని వెల్లడిస్తామని సినీ వర్గాలు తెలిపాయి.

దసరాకు డేవిడ్ రెడ్డి

మంచు మనోజ్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న చిత్రం 'డేవిడ్ రెడ్డి'. హనుమా రెడ్డి యక్కంటి దర్శకత్వం వహిస్తున్నారు. నల్లరంగుల వెంకట్ రెడ్డి, భరత్ మోటుకూరి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. బుధవారం మనోజ్ పుట్టినరోజుని పురస్కరించుకుని చిత్రబృందం ఈ సినిమా టీజర్‌ని ఆవిష్కరించింది. 1897, 1920ల మధ్య బ్రిటిష్ కాలం నాటి నేపథ్యంతో సాగుతున్న ఈ టీజర్ విజువల్స్‌తో ఆకట్టుకునేలా ఉంది. అహింసకి భిన్నంగా హింసతో కూడిన మార్గాన్ని ఎంచుకున్న డేవిడ్ రెడ్డి బ్రిటిష్ వాళ్లని ఎలా మెప్పించాడు? అమాయకులకి అండగా నిలిచే అతను స్వదేశాన్నే ఎందుకు మోసం చేయాలనుకున్నాడు? లాంటి ప్రశ్నలను ప్రేక్షకుల్లో రేకెత్తిస్తూ ఈ టీజర్ ఆద్యంతం ఆసక్తిగా సాగింది. ఈ సినిమాలో మరియా ర్యాబోషాప్కా, రమ్య కృష్ణ, సముద్రఖని తదితరులు నటిస్తున్నారు. ఈ సినిమా దసరాకు థియేటర్లలో విడుదల కానుంది

ఇదే తొలిసారి... అంతా వ్యూహం మేరకే!

నాలుగు నిమిషాలకుపైగా సాగిన 'డ్రాగన్' ప్రచార చిత్రం సినిమాలోని పాత్రలతోపాటు... కథా ప్రపంచాన్ని పరిచయం చేసింది. ఎన్టీఆర్ పుట్టినరోజని పురస్కరించుకుని విడుదలైన ఈ ప్రచారచిత్రం అంచనాలకి దీటుగా, ఆద్యంతం ఆసక్తిని రేకెత్తించింది. ఎన్టీఆర్ అభిమానుల సంతోషానికి అవధుల్లేవు. అయితే సినిమా కథని ఒక వ్యూహం ప్రకారమే ప్రేక్షకులకు పరిచయం చేసినట్టు చెప్పారు చిత్ర దర్శకుడు ప్రశాంత్‌నీల్. ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ''నేనెప్పుడూ ఇలా కథని చెప్పలేదు. నా కెరీర్‌లో ఇదే తొలిసారి. అయితే ఇదంతా ఓ వ్యూహంలో భాగమే. నేటి ప్రేక్షకుడు థియేటర్‌లోకి అడుగు పెట్టకముందే కథ వినడానికి సిద్ధంగా ఉంటున్నారు. కథని దాచి సినిమాపై ఆసక్తిని రేకెత్తించడం అనేది ఒకప్పటి సంప్రదాయం. హాలీవుడ్‌లోనూ ఇప్పుడు కథా ప్రపంచాల్ని పరిచయం చేస్తున్నారు. ఆ పద్ధతుల్ని దృష్టిలో ఉంచుకునే 'డ్రాగన్' ప్రచార చిత్రాన్ని సిద్ధం చేశాం'' అన్నారు ప్రశాంత్‌నీల్. ఈ సినిమాలో నటించేందుకు అంగీకరించడం ఎన్టీఆర్ తీసుకున్న కఠినమైన నిర్ణయాల్లో ఒకటని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతినాయక ఛాయలతో కూడిన లూగర్ అనే పాత్రలో ఎన్టీఆర్ నటిస్తున్నారు. భారతీయ సినిమాల్లో అత్యంత ఖరీదైన ప్రతినాయకుడి పాత్ర ఇదే అవుతుందని చెప్పారు ప్రశాంత్‌నీల్. ఇందులో ఎన్టీఆర్‌కి జోడీగా రుక్మిణీ వసంత్ నటిస్తున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది జూన్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది.

అసహీ... యూహీ...

జపాన్‌పై తనకున్న ప్రేమకు ప్రతిబింబం... అంటూ తాను పెంచుకుంటున్న మకావ్ పక్షుల్ని పరిచయం చేశారు ఎన్టీఆర్. తన పుట్టినరోజని పురస్కరించుకుని ఇన్‌స్టాలో ఎన్టీఆర్ పక్షులతో గడుపుతున్న ఫొటోని పంచుకున్నారు. ఆ పక్షుల పేర్లు అసహీ, యూహీ అని జపనీస్‌లోనే పెట్టినట్లు ఆయన అందులో పేర్కొన్నారు. ఎన్టీఆర్ సినిమాలకు జపాన్‌లో విశేష ఆదరణ లభిస్తున్న సంగతి తెలిసిందే.

ఎలా ఉన్నావని ఎవరూ అడగరు

దిల్లీ: కెప్టెన్‌గా టీమ్‌ఇండియా ఎప్పుడూ అగ్రస్థానంలో ఉండాలనుకున్నానని, అది ఎంత భారమైనా బాధ్యతగా చేపట్టానని భారత మాజీ సారథి విరాట్ కోహ్లి అన్నాడు. ఇక నాయకుడిగా తాను చేసేది ఏమీ లేదని భావించాక వీడ్కోలు పలికానని ఓ కార్యక్రమంలో తెలిపాడు. టెస్టు కెప్టెన్సీకి రిటైర్మెంట్ ఇవ్వడంపై మాట్లాడుతూ.. ''బ్యాటర్‌గా, సారథిగా నేను జట్టులో కేంద్ర బిందువుగా మారిపోయాను. ఆ రెండూ నా రోజూవారీ జీవితంలో ఎంత భారాన్ని మోపుతున్నాయో గ్రహించలేకపోయాను. భారత క్రికెట్ అగ్రస్థానంలో ఉండాలనుకోవడం వల్లే ఏదీ నాకు భారంగా అనిపించలేదు. అయితే కెప్టెన్‌గా వైదొలిగే సమయానికి నాలో ఏమీ మిగల్లేదు. అప్పటికే నా శక్తినంతా పెట్టేశాను. ఎంతో ఒత్తిడిని తట్టుకుంటూ నెట్టుకురాగల సామర్థ్యం మనలో ఉందని ప్రజలు విశ్వసించినప్పుడే నాయకత్వం అప్పగిస్తారు. ఈ క్రమంలో వ్యక్తిగత విషయాలపై దృష్టిపెట్టడం కుదరదు. 'నువ్వు బాగున్నావా..' అని ఎవరైనా అడుగుతారా అన్న ఆలోచన కూడా మీ మనసులోకి రాదు. నేను కెప్టెన్‌గా ఉన్న కాలంలో 'నువ్వు ఎలా ఉన్నావ్' అని అడిగిన వారు ఒక్కరూ లేరు'' అని విరాట్ పేర్కొన్నాడు. 2022 జనవరిలో దక్షిణాఫ్రికాతో 12తో టెస్టు సిరీస్ కోల్పోయిన వెంటనే కోహ్లి కెప్టెన్సీ బాధ్యతలు వదిలేశాడు. అంతకు కొన్ని నెలల ముందే అతడు టీ20 సారథ్యానికి వీడ్కోలు పలికాడు. వన్డే బాధ్యతల నుంచి అతణ్ని తప్పించడం గమనార్హం. 2014లో ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో టెస్టు కెప్టెన్సీ చేపట్టిన విరాట్ టీమ్‌ఇండియాకు ఎన్నో ప్రతిష్ఠాత్మక విజయాలందించాడు. మొత్తం 68కి గానూ 40 మ్యాచ్‌ల్లో భారత్‌ను విజేతగా నిలిపాడు. వరుసగా అయిదేళ్లు సుదీర్ఘ ఫార్మాట్‌లో టీమ్‌ఇండియా నంబర్‌వన్‌గా కొనసాగడంలో కోహ్లి కీలకంగా వ్యవహరించాడు.

వాళ్లతో పోలిస్తే మేం 15 శాతం కూడా..: హాకీ ఆటగాళ్ల ఫిట్‌నెస్‌తో పోలిస్తే క్రికెటర్లు 15 శాతం కూడా ఫిట్‌గా ఉండరని కోహ్లి వ్యాఖ్యానించాడు. ''కొంతమంది ఫిట్‌నెస్‌ను ఓ అసాధారణమైన విషయంగా చూస్తుంటారు. నా వరకైతే మనం చేసే పనికి ఫిట్‌నెస్‌తో ఉండడం చాలా అవసరం. మన దేశంలో క్రికెట్‌కు అధిక ప్రాధాన్యమిస్తూ.. మిగతా ఆటలను విస్మరిస్తుంటారు. నిజానికి హాకీ ప్లేయర్ల ఫిట్‌నెస్ స్థాయిలో మేం 15 శాతం కూడా ఉండం'' అని విరాట్ చెప్పాడు. భారత హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, సీనియర్ హాకీ ఆటగాడు మన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. మా శ్రమ ప్రపంచానికి తెలిసేలా చేసినందుకు కోహ్లికి ధన్యవాదాలు అని అన్నారు.

కోల్‌కతా నిలిచింది.. ముంబయిపై గెలుపు

ఐపీఎల్ 19లో తన ప్లేఆఫ్స్ అవకాశాలను కోల్‌కతా నైట్‌రైడర్స్ సజీవంగా ఉంచుకుంది. ఆసక్తికరంగా సాగిన స్వల్ప స్కోర్ల పోరులో ముంబయి ఇండియన్స్‌ను మట్టికరిపించింది. గ్రీన్, సౌరభ్ దూబె, నరైన్‌ల సూపర్ బౌలింగ్‌తో ముంబయిని కట్టడి చేసిన కేకేఆర్.. మనీష్ పాండే, రోమన్ పావెల్‌ల చక్కని బ్యాటింగ్‌తో లక్ష్యాన్ని ఛేదించింది. ముంబయికి ఇది తొమ్మిదో ఓటమి. గత ఏడు మ్యాచ్‌ల్లో కోల్‌కతాకు ఇది ఆరో విజయం కావడం గమనార్హం. 13 పాయింట్లతో ఉన్న కోల్‌కతా.. తన ఆఖరి మ్యాచ్‌లో ఆదివారం రాత్రి దిల్లీ క్యాపిటల్స్‌తో తలపడుతుంది. అదే రోజు మధ్యాహ్నం మ్యాచ్‌లో ముంబయిని రాజస్థాన్ ఢీకొంటుంది. రాజస్థాన్ ఓడితేనే కోల్‌కతా ప్లేఆఫ్స్ రేసులో ఉంటుంది.

కోల్‌కతా నైట్‌రైడర్స్ సత్తా చాటింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో ముంబయి ఇండియన్స్‌ను ఓడించింది. కోల్‌కతా బౌలర్ల ధాటికి మొదట ముంబయి 8 వికెట్లకు 147 పరుగులే చేయగలిగింది. కార్బిన్ బోష్ (32 నాటౌట్; 18 బంతుల్లో 3×4, 2×6) టాప్ స్కోరర్. గ్రీన్ (2/23) సౌరభ్ దూబె (2/34), కార్తీక్ త్యాగి (2/37), నరైన్ (1/13) ముంబయిని దెబ్బతీశారు. మనీష్ పాండే (45; 33 బంతుల్లో 6×4), రోమన్ పావెల్ (40; 30 బంతుల్లో 4×4, 2×6) బాధ్యతగా ఆడడంతో లక్ష్యాన్ని కోల్‌కతా 18.5 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది.

రాణించిన పాండే, పావెల్: కోల్‌కతా ఛేదనలో తొలి ఓవర్లోనే ఫిన్ అలెన్ (8) వికెట్‌ను కోల్పోయినప్పటికీ రహానె, మనీష్ పాండే ఇన్నింగ్స్‌ను నడిపించారు. మొదట్లో అంత తేలికగా పరుగులు రాలేదు. పుంజుకున్న రహానె (21; 17 బంతుల్లో 4×4) బుమ్రా ఓవర్లో రెండు ఫోర్లు కొట్టాడు. ఆరో ఓవర్లో 48/1తో ఇన్నింగ్స్ సాఫీగా సాగుతున్న దశలో కోల్‌కతాను బోష్ దెబ్బతీశాడు. అతడు తన వరుస ఓవర్లలో రహానె, గ్రీన్ (4)ను ఔట్ చేయడంతో కేకేఆర్ 54/3తో ఇబ్బందుల్లో పడ్డట్లు అనిపించింది. అయితే పాండే, రోమన్ పావెల్ చక్కగా బ్యాటింగ్ చేశారు. ముంబయికి తమపై ఒత్తిడి పెంచే అవకాశం ఇవ్వలేదు. స్ట్రైక్‌రొటేట్ చేసుకుంటూ, వీలైనప్పుడు బంతిని బౌండరీ దాటిస్తూ జట్టును లక్ష్యం దిశగా నడిపించారు. హార్దిక్ ఓవర్లో పాండే వరుసగా రెండు ఫోర్లు కొట్టాడు. 13వ ఓవర్లో రఘు శర్మ బంతిని అతడు బౌండరీ దాటించడంతో కేకేఆర్ స్కోరు 100 దాటింది. పావెల్ కూడా బ్యాట్ ఝుళిపించాడు. కానీ పాండే, పావెల్ కొద్ది తేడాలో ఔట్ కావడంతో కోల్‌కతా 16వ ఓవర్లో 124/5తో నిలిచింది. మ్యాచ్ కాస్త ఆసక్తికరంగా మారింది. ప్రత్యర్థిపై ముంబయి కాస్త ఒత్తిడి పెంచగలిగింది. రింకు సింగ్ (9 నాటౌట్), తేజస్వి దహియా (11) లకు పరుగుల కోసం కష్టపడక తప్పలేదు. ఒత్తిడిలో తేజస్వి కూడా వెనుదిరిగినా.. అనుకుల్ (4 నాటౌట్) తో కలిసి రింకు పని పూర్తి చేశాడు.

ముంబయి తడబాటు: ఎప్పుడో ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించినా.. మెరుగైన ప్రదర్శనతో ముగిద్దామనుకున్న ముంబయికి నిరాశ తప్పలేదు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆ జట్టు తీవ్రంగా తడబడింది. పరుగుల కోసం చెమటోడ్చింది. సహకరిస్తున్న పిచ్‌పై కోల్‌కతా బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ముంబయి క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. ఏ దశలోనూ ఇన్నింగ్స్‌కు ఊపు రాలేదు. మూడో ఓవర్లో రికెల్టన్ (6)ను ఔట్ చేయడం ద్వారా ముంబయిని గ్రీన్ తొలి దెబ్బతీశాడు. అదే ఓవర్లో నమన్ ధీర్ (0)నూ వెనక్కి పంపాడు. ఆ తర్వాత ఎడమచేతి వాటం ఫాస్ట్‌బౌలర్ సౌరభ్ దూబె విజృంభించాడు. నాలుగో ఓవర్లో రోహిత్ శర్మ (15)ను వెనక్కి పంపిన అతడు.. తన తర్వాతి ఓవర్లో సూర్యకుమార్ (15)ను బౌల్డ్ చేశాడు. 41కే నాలుగు వికెట్లు కోల్పోయిన ముంబయిని తిలక్ వర్మ (20; 32 బంతుల్లో 1×6), హార్దిక్ పాండ్య (26; 27 బంతుల్లో 2×4, 1×6) ఆదుకునే ప్రయత్నం చేశారు. వెంటనే మరో వికెట్ పడినవ్వలేదు. కానీ పరుగులు చేయడం వాళ్లకు కూడా చాలా కష్టమైపోయింది. 7 నుంచి 11 ఓవర్ల మధ్య అయిదు ఓవర్లలో 22 పరుగులు మాత్రమే వచ్చాయి. ఒక్క బౌండరీ కూడా రాలేదు. ఆ తర్వాత నరైన్ బౌలింగ్‌లో తిలక్ ఓ సిక్స్ కొట్టినా.. జోరందుకోకుండానే త్యాగి బౌలింగ్‌లో ఔటయ్యాడు. 16వ ఓవర్లో హార్దిక్ నిష్క్రమించేటప్పటికి ముంబయి స్కోరు 95. తర్వాతి ఓవర్లో జాక్స్ (14) ఓ సిక్స్ కొట్టి ఔటయ్యాడు. అయితే పరుగుల కోసం ఇంత కష్టపడ్డ ముంబయి.. 150కి చేరువ కావడం ఊహించనిదే. 18 ఓవర్లలో 115/7తో నిలిచిన ముంబయి.. బోష్ దూకుడుతో ఆఖరి రెండు ఓవర్లలో ఏకంగా 32 పరుగులు రాబట్టింది. చెలరేగి ఆడిన బోష్.. తన జట్టుకు గౌరవప్రదమైన స్కోరును అందించాడు. 19వ ఓవర్లో దీపక్ చాహర్ (10) రెండు ఫోర్లు, బోష్ ఓ ఫోర్ బాదారు. కార్తీక్ త్యాగి వేసిన ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో బోష్ వరుసగా 6, 6, 4 దంచేశాడు. ఆఖరి బంతికి చాహర్ వెనుదిరిగాడు. ముంబయి ఇన్నింగ్స్ మధ్యలో వర్షం దాదాపు గంట పాటు ఆటకు అంతరాయం కలిగించింది. నరైన్ ఒక్క వికెట్టే తీసినప్పటికీ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. 16 డాట్‌బాల్స్ వేశాడు.

స్కోరు వివరాలు

ముంబయి ఇన్నింగ్స్: రికెల్టన్ (సి) పాండే (బి) గ్రీన్ 6; రోహిత్ (సి) గ్రీన్ (బి) దూబె 15; నమన్ ధీర్ (సి) రఘువంశీ (బి) గ్రీన్ 0; సూర్యకుమార్ (బి) దూబె 15; తిలక్ వర్మ (సి) అనుకుల్ రాయ్ (బి) కార్తీక్ త్యాగి 20; హార్దిక్ (బి) నరైన్ 26; జాక్స్ రనౌట్ 14; బోష్ నాటౌట్ 32; దీపక్ చాహర్ (సి) అనుకుల్ రాయ్ (బి) కార్తీక్ త్యాగి 10; ఎక్స్‌ట్రాలు 9 మొత్తం: (20 ఓవర్లలో 8 వికెట్లకు) 147; వికెట్ల పతనం: 1-17, 2-17, 3-23, 4-41, 5-84, 6-95, 7-105, 8-147; బౌలింగ్: అనుకుల్ రాయ్ 1-0-6-0; సౌరభ్ దూబె 4-0-34-2; గ్రీన్ 3-0-23-2; కార్తీక్ త్యాగి 4-0-37-2; నరైన్ 4-0-13-1; వరుణ్ 4-0-28-0

కోల్‌కతా ఇన్నింగ్స్: రహానె (సి) రికెల్టన్ (బి) బోష్ 21; అలెన్ (బి) దీపక్ చాహర్ 8; మనీష్ పాండే (బి) బుమ్రా 45; గ్రీన్ (సి) ఘజన్‌ఫర్ (బి) బోష్ 4; పావెల్ (సి) బోష్ (బి) ఘజన్‌ఫర్ 40; రింకు నాటౌట్ 9; తేజస్వి (సి) రికెల్టన్ (బి) బోష్ 11; అనుకుల్ నాటౌట్ 4; ఎక్స్‌ట్రాలు 6, మొత్తం: (18.5 ఓవర్లలో 6 వికెట్లకు) 148; వికెట్ల పతనం: 1-10, 2-48, 3-54, 4-118, 5-124, 6-140; బౌలింగ్: దీపక్ చాహర్ 3-0-23-1; బుమ్రా 4-0-26-1; బోష్ 3-0-30-3; ఘజన్‌ఫర్ 4-0-25-1; హార్దిక్ 2-0-13-0; రఘు 2-0-23-0; జాక్స్ 0.5-0-7-0

బంగ్లాదేశ్ చేతిలో పాక్ వైట్‌వాష్..

సిలెట్: పాకిస్థాన్ టెస్టు జట్టుకు బంగ్లాదేశ్ షాక్ ఇచ్చింది. సిలెట్ వేదికగా జరిగిన రెండో టెస్టులో బంగ్లాదేశ్ 78 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను బంగ్లాదేశ్ 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. తొలి టెస్టులో పాక్ 104 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. 437 పరుగుల లక్ష్యఛేదనలో 316/7 ఓవర్‌నైట్ స్కోరుతో పాకిస్థాన్ ఐదో రోజును కొనసాగించి 358 రన్స్‌కు ఆలౌటైంది. 75 పరుగుల ఓవర్ స్కోరుతో బ్యాటింగ్‌కు దిగిన మహ్మద్ రిజ్వాన్ (94) పరుగులకు తొమ్మిదో వికెట్‌గా వెనుదిరిగాడు. తర్వాత ఒక్క రన్ కూడా చేయకుండానే పాక్ ఆలౌటైంది. ఎడమచేతివాటం స్పిన్నర్ తైజుల్ ఇస్లాం (6/120) పాక్ పతనాన్ని శాసించాడు. తాజా విజయంతో డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో బంగ్లాదేశ్ ఐదో స్థానానికి ఎగబాకింది. టీమ్‌ఇండియా ఆరో స్థానానికి పరిమితం కాగా.. పాకిస్థాన్ ఎనిమిదో ప్లేస్‌కు పడిపోయింది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ టాప్-2లో ఉండగా.. సౌతాఫ్రికా, శ్రీలంక తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నాయి.

చిన్నోడు దంచేస్తున్నాడు..

అప్పుడప్పుడే క్రికెట్లోకి వచ్చే ఏ యువ బ్యాటరైనా జాగ్రత్త వహిస్తాడు. ఎటాక్ చేయడానికి ముందు నిలదొక్కుకోవడానికి ప్రయత్నిస్తాడు. డిఫెన్స్‌తో వికెట్‌ను కాపాడుకోవాలనుకుంటాడు. సింగిల్స్, ఫోర్లు, సిక్స్‌లతో ఇన్నింగ్స్‌ను తన భవిష్యత్తును నిర్మించుకుంటాడు. కానీ ఈ కుర్రాడి రూటే వేరే. క్రీజులోకి దిగాడంటే విధ్వంసమే. సెకను కూడా వేచి చూసేది లేదు. అది తొలి బంతా, రెండో బంతా.. ఆఖరి బంతా అన్న భేదమే లేదు. అతడి లక్ష్యం ఒక్కటే.. సిక్స్ బాదడం. సిక్స్ తప్ప.. దేనితోనూ సరిపెట్టుకోనంటూ విరుచుకుపడుతున్న ఆ కుర్రాడు ప్రపంచ క్రికెట్లో ఇప్పుడు ప్రకంపనలు సృష్టిస్తున్నాడు. ఎక్కడ చూసినా అతడి నామ జపమే! వైభవ్.. వైభవ్.. వైభవ్!

వైభవ్ సూర్యవంశీ ఆట చూసిన వారికి అతడు 15 ఏళ్ల బాలుడంటే నమ్మకం కలగదు. మిగతా పిల్లలంతా పరీక్షలకు సిద్ధమవుతూ ఉంటే వైభవ్.. క్రికెట్ మైదానంలో మేటి బౌలర్లను చీల్చి చెండాడుతున్నాడు. రాజస్థాన్ రాయల్స్‌కు ఆడుతున్న వైభవ్.. ఇప్పుడు ఐపీఎల్‌కే ప్రధాన ఆకర్షణ. ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్ అభిమానులు అతడి ఆటను చూసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. భవిష్యత్తు స్టార్ అంటూ దిగ్గజ క్రికెటర్లు అతణ్ని ఆకాశానికెత్తేస్తున్నారు. తక్కువ సమయంలోనే వైభవ్ అంత బలమైన ముద్ర వేశాడు మరి. తన అరంగేట్ర ఐపీఎల్‌లో నిరుడు మెరుపు శతకంతో సంచలనం సృష్టించిన వైభవ్.. ఈ సీజన్‌లో మరింత రెచ్చిపోతున్నాడు. ఎప్పుడో ఒక మ్యాచ్‌లో ఆడడం కాదు.. నిలకడగా పరుగుల వరదపారిస్తున్నాడు. బలమైన షాట్లతో బంతిని ఎడాపెడా బాదేస్తూ చూస్తుండగానే మ్యాచ్‌ల స్వరూపాన్నే మార్చేస్తున్నాడు. మంగళవారం లఖ్‌నవూపై అతడు కేవలం 38 బంతుల్లోనే 93 పరుగులు చేసిన తీరు అభిమానులను ఉర్రూతలూగించింది. రాజస్థాన్ ఇప్పుడు ప్లేఆఫ్‌స్‌కు బలంగా పోటీలో ఉందంటే అది వైభవ్ చలవే. ప్రస్తుతం అతడిదే ఆరెంజ్ క్యాప్. బౌలర్లకు చుక్కలు చూపిస్తున్న వైభవ్.. ఇప్పటివరకు 13 మ్యాచ్‌ల్లో 44.53 సగటుతో 579 పరుగులతో పరుగుల వీరుల జాబితాలో అగ్రస్థానంలో ఉన్నాడు. స్ట్రైక్‌రేట్ ఏకంగా 236.32 ఉందంటే.. అతడి ఊచకోత ఎలా సాగిందో అర్థం చేసుకోవచ్చు. ఐపీఎల్ చరిత్రలో ఓ సీజన్‌లో 500పై పరుగులు చేసిన బ్యాటర్లలో అత్యధిక స్ట్రైక్‌రేట్ వైభవ్‌దే కావడం గమనార్హం. రసెల్ (204.8, 2019) రెండో స్థానంలో ఉన్నాడు. ఈ ఐపీఎల్‌లో ఇప్పటివకే 53 సిక్స్‌లు బాదిన వైభవ్.. గేల్ (59, 2012లో)ను అధిగమించి ఓ ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన బ్యాటర్‌గా నిలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయి. నిర్దాక్షిణ్య పవర్ హిట్టింగ్‌తో గేల్, సృజనాత్మక ఆటతో డివిలియర్స్, ఆధిపత్యంతో కోహ్లి..

ఐపీఎల్‌పై తమదైన ముద్ర వేశారు. అభిమానులను ఉర్రూతలూగించిన క్రికెటర్లు ఇంకెందరో ఉన్నారు. కానీ వైభవ్ భిన్నంగా కనిపిస్తున్నాడు. అందుకు కారణం కేవలం పరుగులు కాదు.. స్ట్రైక్‌రేట్, సిక్స్‌లూ కాదు! అసలు భయమనేది లేకపోవడమే వైభవ్‌ను ప్రత్యేకంగా నిలబెడుతోంది. అది 145 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేస్తే ఫాస్ట్‌బౌలరైనా, విశేష అనుభవమున్న స్పిన్నరైనా.. వైభవ్ లెక్క చేయడు. తన నిఘంటువులో ఒత్తిడనేదే లేనట్లు తొలి బంతి నుంచే విరుచుకుపడతాడు. యార్కర్ వేసినా, షార్ట్ బంతి వేసినా, ఆఫ్ స్పిన్నైనా, లెగ్ స్పిన్నైనా దంచి కొడతాడు.

అతడిలో ఎలాంటి ఒత్తిడి కానీ, సందిగ్ధత కానీ, ఎంతో అనుభవమున్న అంతర్జాతీయ బౌలర్లను ఎదుర్కొంటున్నానన్న బెరుకు కానీ కనిపించవు. కనిపించేదల్లా బంతే. తెలిసిందల్లా కసిగా కొట్టడమే. అతడి బ్యాట్ స్పీడ్ అసాధారణం. అచంచల ఆత్మవిశ్వాసంతో దూసుకుపోతున్న వైభవ్‌కు ఇది ఆరంభం మాత్రమే. ఉజ్వల భవిష్యత్తు అతడికి సిద్ధంగా ఉంది. వైభవ్ అంతర్జాతీయ క్రికెట్లో అడుగుపెట్టడం ఇక లాంఛనమే. ఎప్పుడు అన్నది మాత్రమే ఇప్పుడు ఆసక్తి కలిగించే అంశం.

చెన్నై నిలుస్తుందా?

అహ్మదాబాద్: ఐపీఎల్‌లో ప్లేఆఫ్స్ ఆశలు సజీవంగా ఉంచుకోవాలంటే చెన్నై సూపర్ కింగ్స్ ఆఖరి మ్యాచ్‌లో గెలిచి తీరాల్సిందే. మరి సాధిస్తుందా. గురువారం ఆ జట్టుకు కఠిన సవాల్ తప్పదు. లీగ్ దశలో తొలి రెండు స్థానాల్లో చోటు కోసం గట్టిగా పోరాడుతున్న గుజరాత్ టైటాన్స్‌ను ఆ జట్టు ఢీకొంటోంది. గుజరాత్‌కు కూడా ఇదే ఆఖరి మ్యాచ్. చెన్నై ప్రస్తుతం 13 మ్యాచ్‌ల్లో 12 పాయింట్లతో ఆరో స్థానంలో కొనసాగుతోంది. గుజరాత్‌పై నెగ్గినా చెన్నై నేరుగా ప్లేఆఫ్స్ చేరడం అసాధ్యం. ఈ మ్యాచ్‌లో గెలిస్తే సూపర్ కింగ్స్ 14 పాయింట్లకు చేరుతుంది. పంజాబ్, రాజస్థాన్, కోల్‌కతాలకు 14 కంటే ఎక్కువ పాయింట్లు సాధించే అవకాశం ఉంది. మరోవైపు గుజరాత్ 13 మ్యాచ్‌ల్లో 16 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. జీటీ ఈ మ్యాచ్‌లో గెలిచి క్వాలిఫయర్1కు అర్హత సాధించాలని చూస్తోంది. మరి చెన్నై నిలుస్తుందా? లేక గుజరాత్ గెలుస్తుందా? చూడాలి.